

హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ

వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని భార్య హత్య 7



మోగింది కల్యాణ వీణ..

ఆకాశం దిగి వచ్చి మబ్బులతో వేయాలి మన పందిరి.. ఊరంతా చెప్పుకునే ముచ్చటగా జరగాలి పెళ్లంటే మరి.. నేడు పెళ్లంటే అచ్చంగా ఇలాగే చేస్తున్నారు.. ఆకాశమంత పందిరి వేసి.. భూదేవంత పీట వేసి వేడుకగా చేస్తు న్నారు.. అయితే అంతా ఆడంబరమే.. ప్రస్తుతం మాఘ మాసం కావడంతో ఎక్కడికక్కడ పెళ్లి బాజాలు మోగుతున్నాయి.. ఈ ఏడాది మాఘమాసంలో ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల పెళ్లిళ్లు జరిగినట్టు ఒక అంచనా.. ఇక మిగిలినవి మూడే ముహూర్తాలు..

- మాఘమాసంలో సందడే..సందడి
- జిల్లా వ్యాప్తంగా 2 వేల పెళ్లిళ్లు
- ఆడంబరంగా పెళ్లి వేడుకలు
- డబ్బుకు రాజీపడకుండా ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2 : మాఘమాసం కోసం ఎదురుచూడని వారుండరు.. ఎందుకంటే ఎక్కువగా శుభకార్యాలు జరిగేది ఈ మాసంలోనే.. మాఘమాసం కోసం ఏడాదంతా ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం ఉన్నది ఆ మాసంలోనే.. అందుకే ఎటు చూసినా పెండ్లి సందడే.. ఈ నెలలోనే ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల వివాహాలు జరిగినట్టు సమాచారం. గతంలో పెళ్లంటే వారం రోజుల వేడుక... పెళ్లంటే పందిళ్లు..తాళాలు.. తలంబ్రాలు.. విందులు..వినోదాలు..బంధువర్గాల సందడితో రెండు కుటుంబాలు ఆనందంగా నిండు నూరేళ్లు గుర్తుగా జరుపుకునే పండుగ.. నాడు సంప్రదాయ పద్ధతిలో వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించేవారు. వధూవరుల ఇళ్ల ముగింట రాట ముహూర్తం చేసుకుని తాటాకు, కొబ్బరి ఆకు పందిళ్లు వేసుకుని నెల రోజుల ముందు నుంచి ఏర్పాట్లు చేసుకునేవారు. ఇంటి ముంగిట మంటపం ఏర్పాటు చేసుకుని వివాహ వేడుక అద్భుతంగా నిర్వహించేవారు... కానీ నేటి ఆధునిక యుగంలో పెళ్లంటే మెహందీ.. ఎల్లోడే.. బ్యాచిలర్ డే అంటూ రకరకాల పేర్లతో బంధువులను పిలుచుకుని వారం రోజుల పాటు వేడుకగా చేస్తున్నారు..అయితే అదంతా గంట తంతు..రెండు గంటల పాటు భోజనాలు.. అరగంట ఆర్కెస్ట్రాతో ముగిస్తున్నారు. పెళ్లి రోజు ఫంక్షన్ హాలులో కార్యక్రమం ముగించుకుని ఇంటికి వెళ్లిపోతున్నారు. ఎక్కువ శాతం ప్రజలు ఫంక్షన్ హాల్స్‌లో పెండ్లి వేడుకలను నిర్వహించుకునేందుకు ముక్కువ చూపడంతో ఏ ఊళ్లో చూసినా వందల సంఖ్యలో కల్యాణ మంటపాలు పుట్టు కొచ్చాయి. అన్ని రెడీమేడ్ కావడంతో కేవలం వధూవరుల కుటుంబాలు రెడీ అయ్యి వెళ్లడమే పనులన్నీ క్షణాల్లో అయిపోతున్నాయి..పెళ్లంటే జీవితంలో అత్యంత కీలకమైనది కావడంతో వధూవరులు ఎక్కడా రాజీ పడడం లేదు. ఆనందంగా వేడుకగా జరుపుతున్నారు. పైగా పెళ్లి గ్రాండ్‌గా జరపడం ఇప్పుడు స్టేటస్ సిబంల్ కావడంతో ఖర్చుకు వెనుకాడకుండా లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. కోట్లలో ఖర్చు పెట్టిన పెళ్లి వేడుకలు కూడా ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో..

పెళ్లి సందడి మొదలుకావడంతో జిల్లా వ్యాప్తంగా కల్యాణ మంటపాలు కళకళలాడుతున్నాయి. ఈ రోజుల్లో కల్యాణ మంటపం అంటే రూ.50 వేలు మొదలుకొని రోజుకు రూ.5లక్షల వరకు అద్దెలు ఉన్నాయి. అయినా ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు. ప్రజలు వారి ఫంక్షన్ స్థాయి బట్టి వాటిని ఎంపిక చేసుకుంటున్నారు.అయితే సామాన్యులకు వీటి ధరలు అందుబాటులో లేకపోవడం కొంత ఇబ్బందికర పరిస్థితే. ఇక విందు భోజనం అదరగొడుతున్నారు.. ఎంత పెట్టామా కాదు.. ఎన్ని వెరైటీలు పెట్టామా అనేదే ఆలోచిస్తున్నారు. పెళ్లి భోజనం ఏమి పెట్టాడురా అని నలుగురు నాలుగుకాలల పాటు చెప్పుకునేలా ఖర్చుకు వెనుకడుగు వేయని కుటుంబాలు అనేకం ఉన్నాయి. పలు కుటుంబాల్లో వివా హాది శుభాకార్యాలు జరిగినప్పుడు 25 నుంచి 50 రకాలు వడ్డించే వారూ ఉన్నారు. దీంతో వాటికి తగ్గట్టుగా భోజనాలు తయారు చేసే కేటరింగ్‌లు జిల్లాలో అన్ని చోట్ల సిద్ధమయ్యాయి. వివాహాది శుభాకార్యాలకు గతంలో వంట మనిషిని పెట్టుకుని వండివార్చి భోజనాలు పెట్టేవారు. కాని నేటి ప్రపంచంలో అన్ని కేటరింగే.. ముందుగా ఎంతమంది వస్తారో పురమాయిస్తే నిర్వాహకులు తయారు చేసి కల్యాణమంటపానికి హాట్ బాక్స్‌లో తీసుకువచ్చేస్తున్నారు. ఆకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ ఉందంటే ఆశ్చర్యపోనవసరం లేదు. దీంతో వధూవరుల కుటుంబాలకు వంటవార్పు పర్యవేక్షణ పని లేకుండా పోయింది. పెళ్లంతా రెడీమేడ్‌గా జరిగిపోతోంది..



ఇక మిగిలిన ముహూర్తాలు మూడే..

ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీ వరకు ముహూర్తాలు ఉన్నాయి. మార్చి 2 వ తేదీన పదుల సంఖ్యలో పెళ్లిళ్లు జరిగాయి. మార్చి 6వ తేదీన , ఏప్రిల్ 5వ తేదిన, 20వ తేదీన పెద్దముహూర్తలు ఉన్నాయి. ఈ ఏడాది ఇంకా మూడే ముహూర్తాలు మిగిలి ఉన్నాయి. ఆయా ముహూర్తాల్లో వివాహాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సుమారు రెండు నెలల పాటు సాధా రణ ముహూర్తాలతో పాటు పెద్ద ముహూర్తాలు ఉండటంతో బాజా భజంత్రీలు.. మేళతాళాలతో జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి నెలకొంది.

నేడు పల్స్ పోలియో కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 2 : జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నామని, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 0-5 ఏళ్లలోపు చిన్నారులు 1,90,479 మంది ఉన్నారన్నారు. వీరికి పోలియో చుక్కలు వేయడానికి 1,060 కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటితో పాటు 60 ట్రాన్సిట్ టీంలు, 40 మొబైల్ టీంలు కూడా సిద్ధం చేశామని తెలిపారు. 3న పోలియో కేంద్రాల వద్ద చుక్కలు వేస్తారని,ఎవరైనా మిగిలిపోతే 4,5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. రాజమహేంద్రవరం 5వ డివిజన్ కంబాలపేట అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్ వద్ద ఆది వారం ఉదయం 9 గంటలకు పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

గోదారిలో దూకిన మహిళ గల్లంతు!

రాజమహేంద్రవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రోడ్ కం రైలు బ్రిడ్జిపైన 53వ స్తంభం దగ్గర శనివారం సాయంత్రం ఓ మహిళ గోదావరిలో దూకి గల్లంతైనట్టు సమాచారం.ఈ మేరకు టూటౌన్ పోలీసులు అప్రమత్తమై ఈతగాళ్ల సహాయంతో వెతికించినా ఫలితం లేదు. ఆమె బం ధువులెవరూ స్టేషనుకు రాలేదని పోలీసులు తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.ఆమె సచివాలయంలో పనిచేస్తారని సోషల్ మీడియాలో పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

రాజమహేంద్రవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కంబాలపేటకు చెందిన నంది స్వామినాథం(58) ఇన్నీసుపేటలోని ఉపాధ్యాశిక్షణ కళాశాల(బీఈడీ ట్రైనింగ్ కాలేజీ)లో రికార్డు అసిస్టెంటుగా విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం విధులకు వచ్చిన స్వామినాథం కళాశాల గ్రంథాలయం పక్కన ఉన్న గదిలో ఉరి వేసుకున్న స్థితిలో గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పుల్లారావు తెలిపారు.




పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న సీనియర్ ఇంటర్ విద్యార్థులు

ఇంటర్ పరీక్షకు 353 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు రెండో ఏడాది విద్యార్థులకు శనివారం నుంచి ఆరంభమయ్యాయి. 15954 మంది జనరల్ విద్యార్థులకు 15,679.. ఒకేషనల్ 1495కి 1417 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రాంతీయ పర్యవేక్షకులు ఎన్ఎస్‌వీఎల్ నరశింహం పేర్కొన్నారు.52 సెంటర్లలో పరీక్షలు జరిగాయన్నారు. మొత్తంగా 353 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోలేదని తెలిపారు.

భార్యకు మందులు కొనలేక... భర్త ఆత్మహత్య



అనపర్తి,మార్చి 2 : భార్యకు మందులు కొనుగోలు చేయలేక ఒక భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనపర్తి ఏఎస్ఐ వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం. అనపర్తిలోని బాపనమ్మ అల యం సమీపంలో నివాసం ఉంటున్న సత్తి గంగిరెడ్డి(61) కూలీనాలీ చేసుకుని జీవనం సాగించేవాడు. ఇటీవల కాలంలో అతని భార్య అనారోగ్యం భారిన పడడం నెలసరి మందులు కొనేందుకు కూడా స్తోమత లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇదిలా ఉండగా శనివారం అనపర్తి శివారులోని ఎఫ్‌సీఐ గొడౌన్స్ సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో సపోట చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకుని మృతుడు వివరాలకు ఆరా తీయగా గంగిరెడ్డిగా గుర్తించి బంధువులకు సమాచారం అందిం చారు. మృతుడి భార్య మంగయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఏఎస్ఐ తెలిపారు.

ఓటుకు.. రె..ఢీ!



- ఎన్నికల యుద్ధానికి సంసిద్ధం
- ఓటర్ల ఎదురుచూపులు
- సన్నద్ధమైన అధికార యంత్రాంగం
- జిల్లాలో 16 లక్షల మంది ఓటర్లు
- 1569 పోలింగ్ కేంద్రాలు
- 336 సమస్యాత్మక కేంద్రాలు
- 9809 మంది ఉద్యోగులకు బాధ్యత
- కొనసాగుతున్న ఎన్నికల శిక్షణ
- అభ్యర్థుల్లో.. టిక్కెట్ల టెన్షన్
- ఈ నెల రెండో వారమే నోటిఫికేషన్?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఎవరి నోట విన్నా ఎన్నికల మాటే..ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయిరా దేవుడా అన్నట్టు చూస్తున్నారు.జిల్లా ఎన్నికల యంత్రాంగం ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు.ఎన్నికల ఏర్పాట్లు ఇంచుమించు పూర్తి కావొస్తున్నాయి.జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా. కె.మాధవీలత నిత్యం ఏదో చోట ఎన్నికల ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమించి శిక్షణ ఇస్తున్నారు. పోలింగ్ నిమిత్తం 1569 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఓటు వేసిన తర్వాత ఈవీఎంలు భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధం చేశారు.ఏ నియోజకవర్గానికి కౌంటింగ్ ఎక్కడ చేయాలనేది నిర్ణయించి..నన్నయ వర్సిటీలో ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 336 సమస్యాత్మక కేంద్రాలు..

రాజానగరం నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాల్లో 10 అతి సమస్యాత్మక, 50 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. అనపర్తిలో 228 పోలింగ్ కేంద్రాలు ఉండగా 67 సమస్యాత్మ కేంద్రాలుగా ఉన్నాయి. రాజమహేంద్రవరం సిటీలో 232 కేంద్రాలు ఉండగా 13 అతి సమస్యాత్మక, 36 సమస్యాత్మక కేంద్రాలుగా విభజించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 264 కేంద్రాలు ఉండగా 7 అతిసమస్యాత్మక, 15 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాలు ఉండగా 35 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. నిడదవోలులో 205 కేంద్రాలు ఉండగా 41 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. గోపాలపురంలో 248 కేంద్రాలు ఉండగా 62 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. మొత్తం జిల్లాలో 1569 పోలింగ్ స్టేషన్లకు 30 అతి సమస్యాత్మక కేంద్రాలు 306 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి.మిగతా 1263 సాధారణ కేంద్రాలుగా గుర్తించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 9809 మంది ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569, ఇతర పోలింగ్ అధికారులు 6276,మైక్రో అబ్జర్వర్లు 395 మందిని నియమించారు.

జిల్లాలో మహిళలదే పైచేయి..

ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడొస్తుందోనని ఓటర్లు ఎదురు చూస్తున్నారు. రాజకీయ పార్టీలు షెడ్యూల్‌కు ఎదురు చూస్తున్నాయి. ఈ నెల రెండో వారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని సమాచారం. ఇదిలా ఉం డగా అభ్యర్థులు, ఎంపీ బరిలో నిలబడలాలనుకునేవారు మాత్రం టిక్కెట్లు ఎప్పుడు ఖరారు చేస్తారోనని టెన్షన్ పడుతున్నారు.సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో ఓటర్ల జాబితా సిద్ధ మైంది. 2024 ఎస్ఎస్ఆర్ తుది ఓటర్ల జాబితా జిల్లాలో మొత్తం 16,05,762 మంది ఓటర్లు ఉన్నారు.అందులో పురుషులు 7,85,142 మంది, మహిళలు 8,20,515 మంది, థర్డ్ జండర్ 105మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 35,373 మంది ఎక్కు వగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ.జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉం డగా అత్యధిక ఓటర్లు రాజమహేంద్రవరం రూరల్‌లో ఉన్నారు.నియోజకవర్గంలో 2,71159 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1,38,604 మంది, పురుషులు 1,32,531 మంది, థర్డ్ జండర్ 24 మంది ఉన్నారు. అతి తక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు. ఇక్కడ మొత్తం ఓటర్లు 1,83,405 మంది. పురుషులు 89,442, మహిళలు 93,958 , థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఓటర్ల సంఖ్య పరంగా రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 2,60360 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1,34,663 మంది, పురుషులు 1,25,639 మంది, థర్డ్ జండర్లు 58 మంది ఉన్నారు. గోపాలపురం నియోజ కవర్గం ఓటర్ల పరంగా మూడో స్థానంలో ఉంది. ఇక్కడ 2,41,798 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,18,783 మంది, మహిళలు 1,23,008 మంది, థర్డ్ జెండర్ ఏడుగురు ఉన్నారు. అనపర్తి నాలుగో స్థానంలో ఉంది. ఇక్కడ 2,23,255 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,09,323, మహిళలు 1,13,930, థర్డ్ జెండర్ ఇద్దరు ఉన్నారు. రాజానగరం ఐదో స్థానంలో ఉంది. మొత్తం ఓటర్ల సంఖ్య 2,60,360. పురుషులు 1,05,824, మహి ళలు 1,08,083, థర్డ్ జెండర్ నలుగురు ఉన్నారు. నిడదవోలు ఆరో స్థానంలో ఉంది. మొత్తం 2,11,874 మం ది ఓటర్లు ఉండగా పురుషులు 1,03,600, మహిళలు 1,08,269 మంది ఉన్నారు. కొవ్వూరు అతి తక్కువ ఓటర్లతో చివరి స్థానంలో ఉంది. ఓటర్ల తుది జాబితా ప్రకటించినప్పటికీ నామినేషన్ల చివరిరోజు వరకూ ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. జనవరి 22న తుది జాబితా ప్రకటించేనాటికి 5506 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి కాకుండా అప్పటి నుంచి ఇప్పటి వరకూ కొత్తగా ఓటర్లు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు 46,091 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో పరిష్కరించాల్సినవి 9,015 ఉన్నాయి.వాటిలో ఫారమ్-6లు 1752, ఫారమ్-7 5533, ఫారమ్-8 1730 ఉన్నాయి.

జిల్లాలో 232 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు : కలెక్టర్

1రాజమహేంద్రవరం, మార్చి2(ఆంధ్రజ్యోతి) : ఓటర్లు దగ్గరలోనే సత్వరం ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరణచేసి, జిల్లాలో 232 కేంద్రాల పేర్లు మార్చడంతో పాటు 17 లొకేషన్లు మార్చినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం సాయం త్రం వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 1500 కంటే ఎక్కువమంది ఓటర్లు ఉన్న 8 పోలింగ్ కేంద్రాలకు అదనపు స్టేషన్లు ఏర్పాట్లు చేయనున్నామన్నారు. రాజమహేంద్రవరం సిటీలో పోలింగ్ స్టేషన్లు 14, 17, 29, 155, 168 , రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో 17, 30, 31, కేం ద్రాలకు అదనంగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామ న్నారు. అక్కడ ఉదాహరణకు 14 కేంద్రానికి అదనంగా 14ఎ కేంద్రం ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు, మీడియాతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులు కొత్త బ్యాంక్ ఖాతా తెరవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఆర్‌వో జీ.నరసింహులు, సీఎస్ డీటీ కృష్ణనాయక్, రాజకీయ నాయకులు నలబాటి రమేష్ (కాంగ్రెస్), బి. రామ చంద్రారావు (బీజేపీ),చెల్లుబోయిన శ్రీనివాసరావు(టీడీపీ), కెఆర్ జయకర్(వైసీపీ), అర్బన్ తహశీల్దార్ కె.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భలే మంచి.. మాస్టారు!



విద్యార్థులతో పాటు తరగతి గదిలో కూర్చుని పాఠాలు వింటున్న డీఎస్ఈవో వాసుదేవరావు

ఈ చిత్రంలో చూస్తున్నారుగా ఈయనెవరో గుర్తుపట్టారా.. ఈ వయసులో 7వ తరగతి చదవడానికి వెళ్లారా ఏమిటని ఆశ్చర్యపోతున్నారా.. అలా కాదండోయ్.. ఆయన డీఎస్ఈవో వాసుదేవరావు.. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలను తనిఖీ చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం కొవ్వూరు మండలం పంగిడి జడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మి తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి.. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు రాగి జావ అందిస్తున్నారా లేదా అని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు పాఠాలు సరిగా చెబుతున్నారో లేదోనని 7,9 తరగతి గదుల్లో బోధన తరగతులను విద్యార్థులతో పాటు కూర్చుని ఆలకించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డు పనితీరును పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు.. వారి పుస్తకాలను పరిశీలించారు.. బాగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని అన్నారు. కొంత మంది ఆకతాయిలు పాఠశాలలో టాయిలెట్స్‌ను ధ్వంసం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఎం.రామారావు, ఈ.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. - కొవ్వూరు



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు

నగరంలో బ్లేడ్ బ్యాచ్‌గాళ్లు 1180 మంది

- రాజకీయ నాయకుల అండతో పేట్రేగిపోతున్నారు
- రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పోలీసు రికార్డుల ప్రకారం బ్లేడ్‌బ్యాచ్, గంజాయి తదితర అరాచక వ్యక్తులు నగరంలో 1180 మంది ఉన్నారని, ఇప్పటికే సెంట్రల్ జైలులో 350 మంది ఉన్నారని ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. ఆయన 24వ వార్డులో పర్యటిస్తున్న సమయంలో ప్రజలు సమస్యలు ఏకరువు పెట్టారు. రంభ,ఊర్వశి,మేనక థియేటర్ల సమీపంలో ఉన్న ప్రధాన కూరగాయల మార్కెట్ జట్టు కూలీలు బ్లేడ్‌బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని ఎంపీకి తెలిపారు. ఉపాధి కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చామని.. కష్టపడితే రోజుకు రూ.500 గిట్టుబాటు అవుతుందన్నారు. అవి కూడా రాత్రులు తాము ఇళ్లకు వెళ్లే సమయంలో బ్లేడ్‌బ్యాచ్‌గాళ్లు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.బ్లేడ్‌బ్యాచ్,గంజాయిబ్యాచ్, రౌడీషీటర్లను రాజకీయ నాయకులే పెంచి పోషిస్తున్నారని..వారి అండతోనే పేట్రేగిపోతున్నారని కూలీలతో ఎంపీ అన్నారు. దీంతో ఆశ్చర్యపోవడం కూలీల వంతు అయింది.అసాంఘిక వ్యక్తుల నుంచి రక్షణ కల్పించే విషయాన్ని పక్కనబెట్టి ఎన్నికల ప్రసంగంతో సరిపెట్టడంతో కూలీలు విస్మయం వ్యక్తం చేశారు.

హత్యా రాజకీయాలకు
కేరాఫ్ అడ్రస్ వైసీపీ

- రూరల్‌లో మంత్రి అరాచకాలకు అంతంలేదు
- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఫైర్



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 2: రాష్ట్రంలో అధికార వైసీపీ హత్యారాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని టీడీపీ సీనియర్ నేత రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వాధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ తప్పుడు విధానాల్లో ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును ప్రచార ఆర్భాటానికి ఫ్లెక్సీలకు ఉపయోగిస్తున్నారని, వలంటీర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ దొంగ ఓట్లను చేర్చాలని అధికారులు ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం రూరల్‌లో మంత్రిగారి అరాచకాలకు అంతంలేకుండా పోయిందన్నారు. పంచాయతీ నిధులను ఫ్లెక్సీ ప్రచారాలకు వినియోగిస్తున్నారని మండిపడ్డారు. అంగన్వాడీలు, ఆశ వర్కర్లకు బహుమతులు ఇస్తూ అధికార దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తులను కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు కేటాయిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఇసుక మాఫియా జగన్ రెడ్డి నడిపిస్తున్నాడని చెప్పారు. రోజుకు ఇసుకపై రూ.2 కోట్లు పైగా సొమ్ము దోచుకుంటున్నారని ఎన్‌జీటీ ఆదేశాలను కూడా ఇసుక మాఫియా లెక్కచేయడం లేదన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని జగన్‌రెడ్డి ముఠానే హతమార్చిందన్నారు. సీబీఐ విచారణ పిటిషన్ వేస్తానని సునీతమ్మ అంటే జగన్ ఎందుకు ఆపారని ,తొలుత విచారణకోరి అటుపై ఎందుకు ఆపారో జగన్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సీఎంగా ఉండే అర్హత జగన్‌కు లేదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏడువారాల వెంకన్న గోవిందా...గోవిందా




ప్రత్యేక అలంకరణలో ఆత్రేయపురం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, మార్చి 2: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనంతో శోభిల్లింది. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం, తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల సుంగధ పరిమాలలు వెదజల్లే ఫలపుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గోవిందనామస్మరణతో అశేషభక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. 35వేల నుంచి 40వేల మంది భక్తులు భారీ క్యూలైన్ల ద్వారా గంటల తరబడి వేచియున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.42.39 లక్షలు లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, కార్యనిర్వాహకాధికారి, భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల యూనిఫామ్ రద్దుకు కృషి



సచివాలయ ఉద్యోగుల జిల్లా కమిటీకి సభ్యులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి

అమలాపురం టౌన్, మార్చి 2: సచివాలయ ఉద్యోగుల యూనిఫామ్స్ రద్దుకు కృషి చేస్తున్నట్టు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జిల్లాశాఖ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులతో నియమించబడ్డ మహిళా పోలీసుల పదోన్నతులు, జాబ్ చార్ట్ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిని డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వాసా ఎస్.దివాకర్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, కుడుపూడి బాబులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించి నియామక ఉత్తర్వులు అందజేశారు. జిల్లాశాఖ అధ్యక్షుడిగా జగడం కిరణ్, ప్రధాన కార్యదర్శిగా మట్టపర్తి సముద్రం, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా స్వామి, కృష్ణకుమారి, ఉపాధ్యక్షులుగా సవరపు రాజకుమారి, ప్రసాద్, ఎన్వీఎస్ఆర్ లక్ష్మి, చెల్లి నాగేంద్రకుమార్, కోశాధికారిగా ఎస్.శేషగిరితో పాటు కార్యవర్గ సభ్యులను ప్రకటించి నియామక ఉత్తర్వులను అందజేశారు.

సత్యదేవుడికి వెండి,బంగారు వస్తువుల అందజేత



ఈవోకు వెండి బకెట్, స్వామివారికి స్వర్ణ నేత్రాలు, కనుబొమ్మలు, మీసాలు అందజేస్తున్న పురోహితులు

అన్నవరం, మార్చి 2: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం అన్నవరం దేవస్థానం వ్రతపురోహితులు సుమారు 1.75లక్షల విలువైన వెండి బకెట్, స్వామివారికి బంగారు నేత్రాలు, కనుబొమ్మలు, మీశాలను అందజేశారు. వీటిని ఈవో రామచంద్రమోహన్‌కు సంఘ ప్రతినిదులు ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఈవో వ్రతపురోహితలను అభినందించారు. ప్రతీఏటాదేవస్థానం వ్రతపురోహితులు సంఘం తరుపున స్వామి,అమ్మవార్లకు ఏదో ఒక వస్తువును అందించడం ఆనవాయితీగా చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఐపీఎస్ త్రివిక్రమ వర్మ పూజలు



త్రివిక్రమవర్మకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఐపీఎస్ అధికారి త్రివిక్రమవర్మ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించగా ఈవో వారికి స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

బంగారు ధ్వజస్తంభ ప్రతిష్ఠకు సన్నాహాలు

సత్యదేవుడికి స్వర్ణ ధ్వజస్తంభం ప్రతిష్ఠపై సన్నాహాలు చేస్తున్నారు. నెల్లూరుకు చెందిన ఒకదాత వీటిని తయారు చేయిస్తున్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు ప్రతిష్ఠా కార్యక్రమాలు చేపట్టాలని పండితులు భావిస్తున్నారు. ఈనెల 7న జరిగే పాలకమండలి సమావేశంలో దీనిపై స్పష్టత రానుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లపై ఈవో రామచంద్రమోహన్, ఇంజనీరింగ్ అధికారులు, పండితులతో చర్చించారు. ధ్వజస్తంభం లోపలికి ఏవిధంగా తీసుకుని రావాలి అనేదానిపై చర్చించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు రాంబాబు, ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

తిరుపతి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- స్వామివారి ఆదాయం రూ.5,15,858



పెద్దాపురం, మార్చి 2: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారు జామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.4,11,640 అన్నదానవిరాళాలు రూ.95,518 ఆదాయం, కేశఖండనద్వారా రూ.8,400, తులాభారం రూ.300 వెరసి రూ.5,15,858 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

భక్తుల తాకిడితో అప్పనపల్లి కిటకిట

మామిడికుదురు, మార్చి 2: భక్తుల తాకిడితో అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కొత్త, పాత గుడులు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 3964మంది దర్శించుకుని 3012మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,51,139 ఆదాయంగా వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

సిద్ధి వినాయకుడికి బంగారు పళ్లెం బహూకరణ



చైర్మన్‌కు బంగారు పళ్లెం అందజేస్తున్న దాతలు

అయినవిల్లి, మార్చి 2: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారికి ఓ భక్తుడు బంగారు పళ్లెం, వెండి బిందెలను సమర్పించారు. వీరవల్లిపాలానికి చెందిన సూతాపల్లి సత్యనారాయణ-బాలదుర్గాకుమారి దంపతులు శనివారం విఘ్నేశ్వరస్వామిని దర్శించి రూ.5.10లక్షల విలువైన 81.600 గ్రాముల బంగారు పళ్లెం, రూ.80వేలు విలువైన 1003 గ్రాముల వెండి బిందెను అందజేశారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.20వేలు విరాళంగా ఇచ్చారు. భక్త దంపతులకు అర్చకులు వేదఆశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు స్వామివారి చిత్రపటం, తీర్ధ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భీమశంకరస్వామి కల్యాణం



పూజలు చేస్తున్న నవీన్ దంపతులు

జగ్గంపేట, మార్చి 2: కాకినాడజిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి పార్థివ లింగం మహారుద్రాభిషేకం శనివారం 6వ రోజు విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహా న్యాసము, రుద్రాభిషేకము, బిల్వార్చన, కుంకుమార్చన, నవగ్రహ హోమం, వంటిపూజా కాంర్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూమణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని భీమశంకర్‌స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం విశ్వవిద్యాల ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ అమర్ ఆలీషా హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. వేలాదిగా భక్తులు పాల్గొని అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమర్ ఆలీషా మాట్లాడుతూ భగవంతుడు సంకల్పంతో ఈ కోటి మహా రుద్రాభిషేకం నిర్వహించడం ప్రతిరోజు ఏదో ఒక పీఠం నుంచి ఒక పీఠాధిపతిని తీసుకొచ్చి ఆశీస్సులు అందించడం, భక్తితత్వాలు వినిపించడం ఓ మహోన్నత కార్యక్రమం అన్నారు. గోకవరంనకు చెందిన ఆధ్యాత్మిక భక్తుడు తోట సాయి శివతత్వం. రామతత్వం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో కొర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కుంచే రాజా, జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లిరాజు, పాఠంశెట్టి రవి, కుంచే రామకృష్ణ, సూంరపాలెం బాలు, సీఎం, పాఠంశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



కోటి మట్టి శివలింగాలకు అభిషేకం చేస్తున్న ఉమర్ అలీషా

విద్యార్థులను ఢీకొన్న కారు

- ఐదుగురికి గాయాలు
- మద్దూరులంక బ్యారేజ్‌పై ఘటన




మద్దూరులంక బ్యారేజ్‌పై ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న పోలీసులు, కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కొవ్వూరు, మార్చి 2: కారు ఢీకొని ఐదుగురు విద్యార్థులు గాయపడిన సంఘటన కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సూరిశెట్టి సీతామహాలక్ష్మి, అల్లం మనోజ్‌కుమార్, ఆకుల రామవెంకటదుర్గ, రెంపా విర్షిత్, కె.అఖిల్ సైకిళ్లపై శనివారం ఉదయం మద్దూరులోని హైస్కూల్‌కు బయలుదేరారు. బ్యారేజ్‌పై వెనుక నుంచి వస్తున్న కారు విద్యార్థులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు కిందపడి గాయాలపాలయ్యారు. దీంతో వారిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటదుర్గ, సీతామహాలక్ష్మిలకు బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరం రిఫర్ చేశారు. అల్లం మనోజ్‌కుమార్ తండ్రి చిట్టివీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

భార్యను కడతేర్చిన కసాయి భర్త

- అక్రమ సంబంధాన్ని ప్రశ్నించడమే ఆమె చేసిన పాపం
- వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని.. భార్యను కొట్టి చంపేశాడు
- ఆపై ఆత్మహత్యగా చిత్రీకరణ
- పోలీసు విచారణలో నేరం అంగీకారం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, మృతురాలు తానెం లక్ష్మి(ఫైల్)

నల్లజర్ల, మార్చి 2: తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని తన భార్యను అత్యంత క్రూరంగా కొట్టి చంపేశాడు. వివరాలిలా ఉన్నాయి. నల్లజర్ల మండలం జగన్నాథపురానికి చెందిన తానెం విష్ణు ఆయిల్‌పామ్ గెలల కోత కార్మికుడిగా చేస్తున్నాడు. 2012లో అదే గ్రామానికి చెందిన లక్ష్మి(28)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. లక్ష్మి గత ఆదివారం జంగారెడ్డిగూడెంలో ఉంటున్న తన సోదరి పెద్దింట్లు ఇంటికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సమయానికి విష్ణు తన ఇంట్లో వేరే మహిళతో ఉండడం చూసి గొడవ పడి ంది. అప్పటి నుంచి ప్రతిరోజూ ఏదొక సమయంలో గొడవలు పడుతున్నారు. తమ వివాహేతరబంధానికి భార్యఅడ్డుగా ఉంటుందని భావించిన విష్ణు శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్య నోట్లో గుడ్డలు కుక్కి అత్యంత దారుణంగా చిత్రహింసలకు గురిచేసి చంపేశాడు. మృతదేహాన్ని ఫ్యాన్‌కి వేలాడదీసి ఆత్మహత్య చేసుకున్నట్టు చిత్రీకరించాడు. అదే గ్రామంలో చదువుతున్న కుమార్తె మహి, కుమారుడు రాంచరణ్‌ను పిలిచి.. అమ్మమ్మ ఇంటికి వెళ్లి అమ్మ ఆత్యహత్య చేసుకుని చనిపోయిందని చెప్పమని కబురు పంపించాడు. వారంతా వచ్చి చూడగా లక్ష్మి ఫ్యానుకు ఉరితో వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. భర్తపై అనుమానంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టీవీ సురేష్ మృతదేహాన్ని పరిశీలించగా శరీరమంతా గాయాలు ఉండడం గమనించి హత్య కేసుగా నమోదు చేశారు. నిందితుడు విష్ణును పోలీసులు ఆదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తానే హత్యచేసినట్టు అంగీకరించాడు.

శివకోటిలో భారీ దొంగతనం

- రూ.20లక్షలు విలువచేసే బంగారం, వెండి, నగదు అపహరణ

రాజోలు, మార్చి 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటిలో గాదె వెంకటసూర్యరామ మురళీకృష్ణ ఇంట్లో దొంగలు చొరబడి తాళాలు పగులకొట్టి, ఇంట్లో ఉన్న రూ.20లక్షల విలువచేసే బంగారం, వెండి, నగదును దోచుకువెళ్లారని శనివారం రాజోలు ఎస్ఐ జి.పృథ్వి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మురళీకృష్ణ కుటుంబ సభ్యులు గత నెల 28న కుటుంబ సభ్యులతో వివాహ వేడుకకు మచిలీపట్నం వెళ్లారు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు బద్దలకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారం, వెండి, నగదును దొంగలు దోచుకువెళ్లారు. దీంతో దొంగతనం జరిగిందని భావించిన మురళీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి రాజోలు ఎస్ఐ పృథ్వి తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీములు చేరుకుని ఆధారాలు సేకరించారు. మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పృథ్వి తెలిపారు.



శివకోటిలో తలుపులు బద్దలకొట్టిన దొంగలు

పడవ ప్రమాదంలో మత్స్యకారుడు మృతి



కొపనాతి కోదండ

ఉప్పలగుప్తం, మార్చి 2: వాసాలతిప్ప ప్రాంతంలో చేపల వేటకు వెళ్లిన బోటు తిరగబడి అల్లవరం మండలం నక్కా రామేశ్వరంనకు చెందిన కొపనాతి కోదండ(40) మృతి చెందాడు. నక్కారామేశ్వరంనకు చెందిన ఆరుగురు మత్స్యకారులు శనివారం ఉదయం పంతాడి పెంటయ్యకు చెందిన ఇంజన్ బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్ళారు. చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్ప తీరంలో సముద్రంలో వేటాడుతుండగా బోటు తిరగబడింది. ఈ ప్రమాదంలో కొపనాతి కోదండ సముద్రంలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. పడవలోని మిగిలిన అయిదుగురు సురక్షితంగా బయటపడ్డారు. మృతుని సోదరుడు శివయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.మనోహర్‌జోషి తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

గోపాలపురం, మార్చి 2: గోపాలపురం శివారు పొగాకుబోర్డు సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ కే.బాలసురేష్ బాబు వివరాల ప్రకారం.. చాగల్లు గ్రామానికి చెందిన ఆంజనేయులు దేవరపల్లి నుంచి ద్విచక్రవాహనంపై గోపాలపురం వైపు వస్తుండగా గోపాలపురం వైపు నుంచి వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. ఆయన వెంట ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఉన్నారు.



ఎగుమతి చేసేందుకు సిద్ధం చేస్తున్న పచ్చిమామిడికాయలు

కొండెవరం టూ కలకత్తా
పచ్చిమామిడి ఎగుమతి

కొండెవరం (కొత్తపల్లి), మార్చి 2: ఎండాకాలం వచ్చేసింది. పచ్చిమామిడికాయలు ఎగుమతిచేసే సీజన్ ఆరంభమైంది. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం కొండెవరం నుంచి కలెక్టర్ రకం పచ్చిమామిడికాయలను కలకత్తా ఎగుమతి చేసేందుకు రైతుల నుంచి సేకరిస్తున్నారు. కొండెవరంలో మూడు కేంద్రాల నుంచి పచ్చిమామిడి కాయలను సేకరించేందుకు కేంద్రాలను సిద్ధం చేశారు. చేలల్లోనుంచి కోసుకొచ్చిన పచ్చిమామిడికాయలను కిలో రూ.35లకు వర్తకులు టోకుగా కొనుగోలు చేస్తున్నారు. వీటిని కలకత్తా నగరానికి రవాణా చేస్తామని కొనుగోలు దారుడు జి.కోటి చెప్పారు.

స్వల్పకాలిక శిక్షణా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ధవళేశ్వరం, మార్చి 2: పీఎంకేవీవై పథకంలో భాగంగా జిల్లాలోని నిరుద్యోగ యువతకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు సంబంధించి స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45ఏళ్ల మధ్య వయసుండి పదో తరగతి ఆపై విద్యార్హత ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్లతో ఈనెల 15 లోపుగా కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు. వివరాలకు 92420 50231లో సంప్రదించాలని కోరారు.

జింకపై వీధి కుక్కల దాడి

- రక్షించిన స్థానికులు
- ఫారెస్టు అధికారులకు అప్పగింత



కుక్కల దాడిలో గాయపడ్డ జింక

మోతుగూడెం, మార్చి 2: చింతూరు మండలం మోతుగూడెంలో శనివారం పోస్టు ఆఫీస్ సెంటర్‌లో ఉదయం అడవిలో నుంచి జింక ఊరులోకి వచ్చింది. దానిపై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేశాయి. దాన్ని గమనించిన స్థానికంగా నివాసం ఉంటున్న ఏపీ జెన్కో ఉద్యోగులు వీధి కుక్కల నుంచి జింకను రక్షించారు. అనంతరం ఫారెస్ట్ సిబ్బందికి ఫోన్ చేసి జింకను అప్పగించారు. పశువైద్యాధికారి వద్ద ప్రథమ చికిత్స చేయించి పెద్ద పొలాల అడవిలో వదిలిపెట్టారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గోపాలపురం, మార్చి 2: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సీకే గౌతమ్‌రాజ్, కేఎస్ వినయ్‌కుమార్ పువ్వుల వ్యాపారంలో నష్టం రావడంతో అధిక ధనార్జన కోసం గంజాయి వ్యాపారానికి తెరదీశారు. ముందస్తు సమాచారంతో శుక్రవారం సాయంత్రం గోపాలపురం మండలం జగన్నాధపురం శివారులో ఏర్పాటుచేసిన బోర్డరు చెక్‌పోస్టు వద్ద దేవరపల్లి సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ సతీష్‌కుమార్, రెవెన్యూ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 4.290కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

తెలంగాణ రాష్ట్రం ములుగుజిల్లా మంగపేట గ్రామం దేవత హనుమంత రావు అపరాల వ్యాపారం చేస్తుంటాడు. అతడి వద్ద తెలంగాణకు చెందిన బైట్ల సాయిబాబా 20 ఏళ్లగా గుమస్తాగా పని చేస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా సాయిబాబా తరచూ అపరాలు కాకినాడ తీసుకెళ్లి అమ్ముతుంటాడు. అక్కడ అపరాలు అమ్మిన సొమ్ము రూ.7,45,000 బ్యాగులో పెట్టుకుని గత నెల 29వ తేదీన బస్సు ఎక్కి రాజమండ్రిలో దిగాడు. అక్కడ సాయిబాబాకు గతంలో పరిచయం ఉన్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట గ్రామానికి చెందిన ఏర్నేటి విజయకుమారి, ఆమె మేనల్లుడు మాడా మణికుమార్ తారసపడ్డారు. తాము కూడా తెలంగాణ వస్తున్నామని చెప్పి సాయిబాబాతో పాటు రాజమండ్రిలో బస్సు ఎక్కారు. గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్‌కి వచ్చేసరికి సాయిబాబా నిద్రపోతున్న సమయంలో ఇద్దరూ సొమ్ము ఉన్న బ్యాగును దొంగిలించి బస్సు దిగి పారిపోయారు. మెలకువ వచ్చి చూడగా సాయిబాబా దగ్గర సొమ్ములున్న బ్యాగ్ కనిపించకపోవడంతో గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దేవరపల్లి సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ కె.సతీష్ కుమార్ మండపేట వెళ్లి విజయకుమారి, మణికుమార్‌లను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.7,45,000 రికవరీ చేశారని, వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ సత్యానందం, పోలీస్ సిబ్బంది ఉన్నారని డీఎస్పీ రామారావు తెలిపారు.



నిందితులను పట్టుకుని వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రామారావు

సత్యదేవా నర్సరీని సందర్శించిన
ఆర్‌బీఐ బృందం

కడియం, మార్చి 2: కడియపులంకలో సత్యదేవానర్సరీని శనివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రీజనల్ డైరెక్టర్ ఏవో బషీర్, జీఎం అనుజ్ రాజన్, జీఎం మేఘనసింగ్, డీజీఎం అనతి తదితరులు సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా అబ్బులు ఆర్‌బీఐ అధికారికి థాయ్ ఆగ్లోనిమా అనే మొక్కను అందజేసి స్వాగతించారు. అధికారులు నర్సరీలో వివిధ రకాల మొక్కలు పరిశీలించారు. వాటి వివరాలు, శాస్త్రీయ నామాలను పుల్లా వీరబాబు, రాజశేఖర్‌లు వివరించారు. నర్సరీరంగ అభివృద్ధికి బ్యాంకుల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, త్వరలో బ్యాంకు కార్యాలయాలు రానున్నాయని వాటి సుందరీకరణకు మొక్కల అవసరం నిమిత్తం వారు నర్సరీని సందర్శించామన్నారు. వారి వెంట రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ అధికారులు ప్రసాద్, క్రిష్టయ్య తదితరులున్నారు.



ఆర్‌బీఐ అధికారికి మొక్కను అందజేస్తున్న పుల్లా అబ్బులు

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

'పిల్లలకు పోలియో చుక్కలు తప్పక వేయించాలి'

రంపచోడవరం, మార్చి 2: ఐదు సంవత్సరాలలోపు పిల్లలను పోలియోచుక్కలు తప్పక వేయించాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాల యంలో ఆయన పల్స్ పోలియో చుక్కల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మొదటిరోజు ఆదివారం ప్రభుత్వం ఏర్పాటుచేసిన పోలియో కేంద్రాలలో పిల్లలకు వ్యాక్సిన్ వేస్తారని, అదేవిధంగా మరో రెండు రోజులపాటు ఏఎన్ ఎంలు, ఆశ వర్కర్లు మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. వైద్యాధికారులు శిరీష, రాధిక, వినోద్‌కుమార్, పవన్, ఎంపీహెచ్‌వో పీటర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మలేరియా వర్కర్లు ర్యాలీలో పాల్గొన్నారు.

10,809 మంది చిన్నారులే లక్ష్యంగా పోలియో చుక్కలు

చింతూరు, మార్చి 2 : చింతూరు ఐటీడీఏ పరిధిలో జాతీయ పోలియో కార్యక్రమం 10,809 మంది చిన్నారుల లక్ష్యంగా నిర్వహించనున్నట్లు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పేర్కొన్నారు. శనివారం ఆయన పోలియో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై ఆయన వివరించారు. చింతూరు ఐటీడీఏ పరిధిలోని పది ప్రాథమిక వైద్యశాలల పరిధిలోని 0-5 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి పోలియోచుక్కలు వేయించాలన్నారు. ఆరోగ్యమైన నిండు జీవితాన్ని ఆకాంక్షిస్తూ తల్లిదండ్రులు తమవంతు బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని స్వీకరించాల్సి ఉందన్నారు. కార్యక్రమ పకడ్బందీగా నిర్వహణ కోసం 40 మంది సూపర్ వైజర్లుని రూట్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. ఈ విషయంలో ఎటువంటి అలసత్వం తగదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, తులసిపాకల వైద్యాధికారి ఉదయ్‌కుమార్ రెడ్డి, ఐటీడీఏ ఏపీవో సుజాత, ఏవో రాజకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో వెదురు ఉత్పత్తులు ప్రోత్సహించేలా చర్యలు

● ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం, మార్చి 2: ఏజెన్సీలో వెదురు ఉత్పత్తులను తయా రు చేసే గిరిజనులను ప్రోత్సహించనున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే చెప్పారు. శనివారం ఆయన మండలంలోని సువర్ణవాడలో వెదురుతో తయారుచేసిన ఉత్పత్తుల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వెదురుతో తయారుచేసిన ఉత్ప త్తులతో గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టామ ని, దానిలో భాగంగానే యూత్ ట్రైనింగ్ సెంటర్లలో 30రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. తయారు చేసిన వెదురు ఉత్పత్తులను మైదాన ప్రాంతాలు, పట్టణాలకు మార్కెటింగ్ చేస్తారన్నారు. రాకోట గ్రామంలో పూర్తిస్థాయిలో తాగునీటిని ఏర్పాటు చేయాలని గ్రామ స్తులు పీవో దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, వెలుగు కోఆర్డినేటర్ రామరాజు పాల్గొన్నారు.

సీపీఎంలో చేరిన 55 వైసీపీ కుటుంబాలు

చింతూరు, మార్చి 2 : ఏడుగురాళ్ళపల్లి, పావురులంక గ్రామాలకు చెందిన 55 వైసీపీకి చెందిన కుటుంబాలు శనివారం తమ పార్టీలో చేరినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తెలిపారు. ఈ మేరకు వారందరినీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క పల్లెలో కూడా వృద్ధి కార్యక్రమం కూడా చేపట్టకపోవడంతో ప్రజలు విసిగిపోయారన్నారు. రహదారులు, తాగునీటి లాంటి ప్రధాన మౌలిక సదుపాయాలు కల్పించిన దాఖలాలే లేవన్నారు. పోలవరం నిర్వాసితులకు వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీసం సురేష్, పల్లపు వెంకట్, మల్లంసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అనంతబాబు పర్యటనను బహిష్కరించండి'

కూనవరం, మార్చి 2: ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటనలను విలీన మండలాల ప్రజలు బహిష్కరించాలని అరకు పార్లమెంట్ టీడీపీ యువత అధికార ప్రతినిధి గణేశుల రంజిత్‌కుమార్ అన్నారు. కాతవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముంపు మండల ప్రజలను వైసీపీ ప్రభుత్వం అన్నివిధాలుగా మోసం చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఆదినారాయణ పాల్గొన్నారు.

ఏం సాధించారని విలీన మండలాల్లో పర్యటనలు

విలీన మండలాల ప్రజలకు ఎటువంటి అభివృద్ధి చేయకుండా ఆర్భాటాలతో ఎమ్మెల్సీ అనంతబాబు ఎమ్మెల్యే ధనలక్ష్మి ఉత్తుత్తి పర్యటనలు చేస్తున్నారని టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు అన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలీన మండలాల ప్రజలకు పోలవరం పరిహారం అందిస్తామని ఆర్భాట ప్రకటనలు చేశారని అవి ఇంతవరకు నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కన్యకాపరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బెంగాలీ క్యాంప్-3లో అవగాహన సమావేశం

మోతుగూడెం, మార్చి 2: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ పరిధిలోని బెంగాలీ క్యాంప్-3 గ్రామంలో డొంకరాయి ఎస్ఐ శివకుమార్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, గ్రామాల్లో ఎటువంటి గొడవలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

'ఐటీడీఏ వద్ద ధర్నాకు ఆదివాసీలు తరలిరావాలి'

రంపచోడవరం, మార్చి2: జీవో నెం.3ని పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాకు ఏడు మండలాల్లోని ఏడు తెగల ఆదివాసీలు, నిరుద్యోగులు తరలిరావాలని ఆదివాసీ ఉద్యోగుల జేఏసీ నాయకులు కంగల శ్రీని వాస్, వై.విల్సన్ బాబు, సనాతనబాబు, జి.నాగభూషణం, సీహెచ్ ప్రేమ్‌కుమార్, కారం సూరిబాబు, కడబాల రాంబాబు, సీహెచ్. శుభకృష్ణదొర, మడకం వరప్రసాద్‌దొర, పొడియం పండుదొర, కుండ్ల ఆదిరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. జీవోనెం.3ని పునరుద్ధరించాలని, లేక దాని స్థానంలో వేరొక జీవో జారీ చేసి చట్టం చేయాలని, ఏజెన్సీలోని అన్ని శాఖలలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యా పోస్టులు స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలన్నారు. డీఎస్సీ-24లో ఆశ్రమ పాఠశాలల్లో ప్రకటించిన 66 ఉపాధ్యాయ పోస్టులకు రోస్టర్ పద్ధతి రద్దుచేసి ఆ పోస్టులను కూడా స్థానిక ఆదివాసీలకే కేటా యించాలన్నారు. సోమవారం జరిగే ధర్నాకు మేధావులు, పెద్దలు, ఉద్యోగులు, ఆదివాసీ సంఘాలు, మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

'చలో ఐటీడీఏను విజయవంతం చేయండి'

రాజవొమ్మంగి, మార్చి 3: గిరిజన నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి జీవో నెంబర్ 3ను పటిష్ఠ అమలుకై ఈనెల 4న గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జరిగే చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని గిరిజనులందరూ జయప్రదం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఉర్లాకులపాడులో గిరిజనులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నేతలు కోసూరి అప్పలరాజు, జోగిరెడ్డి, వీరబాబు, గోపి ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయం: వంతల

రంపచోడవరం, మార్చి 2: తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని, రానున్న ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ వ్యక్తి గత ప్రయోజనాలు, అధికారం కోసంకాదని, ఐదుకోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే టీడీపీ- జనసేన పార్టీలు కలిశాయని, వైఎస్ఆర్ పార్టీ దొంగలకు వ్యతిరేకంగా తేదేపా, జనసేన కలిసి పోరాడుతాయన్నారు. సంక్షేమ పథకాలు అ మలు చేసేది చంద్రన్న ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు.

మా ఓట్లు యథావిధిగా రంపకు మార్చండి

దేవీపట్నం, మార్చి 2: గ్రామాల అనుమతి లేకుండా మార్పు చేసిన ఓట్లను రంపచోడవరం నియోజకవర్గానికి మార్చాలని దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి విజ్ఞప్తి చేశారు. దేవీపట్నం మండలంలో సుమారు 25ముంపు గ్రామాలు గోకవరం మండలంలోకి వచ్చేశాయని, కొయ్యూరు, దేవీపట్నం గ్రామాల 2475 ఓట్లను జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలంలోకి పంచాయతీ అనుమతికాని గ్రామస్తుల అభిప్రాయం తీసుకోకుండా మార్పుచేయడంపై సర్పంచ్ మండిపడ్డారు.

అభిప్రాయ సేకరణ కాదు ఓట్లను బదిలీ చేయండి

తమ అనుమతి లేకుండా ఓట్లను తిరిగి మార్చాలని కోరితే అధికారులు అభిప్రాయ సేకరణ సరికాదని దేవీపట్నం డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ వద్ద నిర్వాసితులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలో దేవీపట్నం, తొయ్యూరు గ్రామాలకు చెందిన 2475 ఓట్లను జగ్గంపేట నియోజకవర్గంలో బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమకు ఇంకా పునరావాస సమస్యలు తీరకుండానే అనుమతి లేకుండా ఓట్లు బదిలీ చేయడంపై తీవ్ర ఆందోళన నెలకొంది.

మనోధైర్యాన్ని కోల్పోకూడదు

కడియం, మార్చి 2: విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోను మనోధైర్యాన్ని కోల్పోకూడదని, సమస్య తలెత్తినపుడు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియ చేసి పరిష్కారాన్ని వెదుక్కోవాలని, క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోకూడదని సీఐ బి.తులసీధర్ పేర్కొన్నారు. శనివారం కడియం ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ డ్రైవింగ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, సువర్ణవేణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందరెడ్డి హత్యకేసులో జగన్ పాత్రపై విచారణ జరపాలి

▸▸ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీఎం జగన్ రెడ్డి పాత్రపై విచారణ జరపాలని రాజమహేంద్రవరం సిటీ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డివిజన్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్ వివేకానంద రెడ్డి గొడ్డలి పోటుతోనే చనిపోయారని జగన్ అంత ఖచ్చితంగా ఎలా చెప్పారని ప్రశ్నించారు. సీఎం కాకముందు సీబీఐ విచారణ కోరిన జగన్ అటుపై అతని సోదరి సునీతమ్మ విచారణ చేయించాలని సీబీఐను కోరితే ఎందుకు జగన్ అడ్డుపడ్డారో చెప్పాలన్నారు. బాబాయిని చంపిన అబ్బాయిని ఎందుకు సీఎం జగన్ కాపాడుతున్నారని అన్నారు. హైప్రొఫైల్ కేసులో ఇంత జాప్యానికి జగన్ కారణమన్నారు. వివేకానందరెడ్డిని అత్యంత క్రూరంగా నరికి నరికి చంపిన హంతకుడికి శిక్షపడకపోతే రేపు పౌరుల ప్రాణాలకు ఎవ్వరికి రక్షణ ఉండదన్నారు. రాష్ట్రంలో అరాచకాన్ని అణచివేయాలంటే వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతమ్మ చెప్పినట్లు జగన్ రెడ్డిని ఓడించాలన్నారు.


టీడీపీ-జనసేలో చేరుతున్న వారితో ఆదిరెడ్డి శ్రీనివాస్

చర్చిలో మంచినీటి బోరుకు ఆర్థిక సాయం

బైపాస్ రోడ్డులో ఉన్న ఈస్ట్ పారిస్ లూథరన్ చర్చి అవసరాల నిమిత్తం చర్చి సంఘస్తుల సౌకర్యాలకు మంచినీటి బోరు వేసేందుకు ఆదిరెడ్డి వాసు ఆర్థిక సాయం చేశారు. శనివారం చర్చికి వెళ్లిన ఆయన సంఘస్తులతో మాట్లాడి చర్చిలో మంచినీటి బోరు వేసేందుకు రూ.లక్ష భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. ఆదిరెడ్డి వాసుకు చర్చిసంఘస్తులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పోలాకి పరమేష్, కిలపర్తి నాగభూషణం, సనపతి సత్తిబాబు, శేఖర్, ఎం.అప్పారావు, ఆసూరి సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీ-జనసేనలో వంద మంది చేరిక

రాజమహేంద్రవరం 47 డివిజన్‌లో శనివారం రాత్రి సుమారు వందమంది కార్యకర్తలు టీడీపీ-జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఆదిరెడ్డి వాసు, జనసేన నేత అనుశ్రీ సత్యనారాయణ పార్టీ కండువాలతో ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని చంద్రబాబు సీఎం కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుల దాసరి చిన్న, , జనసేన నాయకులు అల్లాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రలను భగ్నం చేయాలి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 2: తెలుగుదేశం పార్టీపై వైసీపీ చేస్తున్న కుట్రలను భగ్నం చేసే విధంగా టీడీపీ సోషల్ మీడియా ముందుకు సాగాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా వైసీపీ అవినీతిని, అరాచకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు చేసే మేలుపై రూపొందించిన కార్యక్రమాలను, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మన టీడీపీ యాప్‌లో బెస్ట్ పెర్ఫార్‌మెన్స్ చూపిన పలువురు కార్యకర్తలకు పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన మెమెంటోలను రామకృష్ణారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, త్రిమూర్తులు, వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోనాల వెంకటరెడ్డి, ఇన్‌చార్జులు అన్నవరం, చిన్నా మాస్టర్, సతీష్, వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

వివేకానందను చంపిందెవరో ప్రజానీకానికి తెలిసింది

రంగంపేట, మార్చి 2: మండలంలోని ఈలకొలను గ్రామ శివారు అచ్యుతాపురంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌పాత్రపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు. వైఎస్ సునీతరెడ్డి చేసిన ఆరోపణలతో వివేకానందను చంపిందెవరో ప్రజానీకానికి తెలిసిందన్నారు. బాబాయిని చంపిన అవినాష్‌రెడ్డిని జగన్ ఎందుకు కాపాడుతున్నారో, ప్రతిపక్షంలో ఉండగా టీడీపీని సీబీఐ విచారణ అడిగిన జగన్ అధికారం చేపట్టాక ఎందుకు వద్దన్నారో చెప్పాలన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, నీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, బాబా, సాయిబాబు, మాచిన వెంకన్నదొర పాల్గొన్నారు.


సీతానగరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నేడే పల్స్‌పోలియో

● నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి.. రాజానగరం పీహెచ్‌సీలో 5191 మంది చిన్నారులు: డాక్టర్ రామభాస్కర్

రాజానగరం, మార్చి 2: ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియోకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాజానగరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ జి.రామభాస్కర్ తెలిపారు. పల్స్ పోలియో సందర్భంగా వైద్య సిబ్బందితో శనివారం కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులు 5,191 మంది ఉన్నట్టు గుర్తించామన్నారు. పల్స్ పోలియోకు సంబంధించి నాలుగు రూట్లలో 34 బూత్‌లు ఏర్పాటు చేశామని, వీటిలో ఒక బూత్ రాజానగరం బస్టాండ్‌లోనూ, మరొకటి జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేశామన్నారు. మిగిలినవి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లోని పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఏర్పాటు చేశామన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ రెండు పోలియో చుక్కల మందు వేస్తామన్నారు. అంతేకాకుండా 23 హైరిస్క్ సైట్స్‌ను గుర్తించి వారి వద్దకు వెళ్లి పోలియో డ్రాప్స్ వేసేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఈ అవగాహన ర్యాలీలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎస్వీవీ రమణ, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: పాలచర్ల పీహెచ్‌సీ పరిధిలో 0-5 సంవత్సరాల వయసున్న పిల్లలు 3,435 మందిని గుర్తించామని వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలో పోలియోచుక్కలు వేసేందుకు 20 కేంద్రాలతో బాటు ఒక సంచార కేంద్రాన్ని, 21 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం పిల్లలకు పోలియో కేంద్రాల్లో చుక్కలు వేస్తామన్నారు. సోమ, మంగళవారాల్లో బృందాలు ఇంటింటా తిరిగి మిగిలి ఉన్న పిల్లలను గుర్తించి పోలియోచుక్కలు వేస్తామని బెనడిక్ట్ చెప్పారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, వలంటీర్లు, గ్రామసచివాలయ సిబ్బంది ద్వారా పల్స్‌పోలియో కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేశామన్నారు.

సీతానగరం: సీతానగరం పీహెచ్‌సీ పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు డాక్టర్లు ఏపీకే చైతన్య, రాజు తెలిపారు. శనివారం పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఐదేళ్లలోపు పిల్లలు 5689 మంది ఉన్నారని, వారికోసం 36 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికుల కోసం సీతానగరం బస్‌స్టాండ్ సెంటర్‌లోను, ఇటుక బట్టీ దగ్గర ఉన్న పిల్లల కోసం ఒక సంచార బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు, ప్రజా నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖల సిబ్బంది సహకరించి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఏ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డికి సీటు కేటాయింపుతో పేటీయం బ్యాచ్ గొంతులో వెలక్కాయ్

టీడీపీ నేతలు దాస్యం, చాపల

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు రాజమహేంద్రవరం సిటీ సీటు ఖరారు కావడంతో వైసీపీ పేటీఎం బ్యాచ్ గొంతులో వెలక్కాయ్ పడిందని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, నగర ఎస్సీసెల్ అధ్యక్షుడు చాపల చిన్నరాజు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తొలి జాబితాలోనే తమ నాయకుడు ఆదిరెడ్డి వాసు పేరు ఖరారు కావడంతో ఓటమి తప్పదని భయపడిన వైసీపీ పేటీఎం బ్యాచ్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. పేపరుమిల్లు కార్మికుల కష్టం లక్షలాది రూపాయలు నొక్కేసిన ప్రవీణ్ చౌదరి, చైన్ స్నాచింగ్ కేసులో ఉన్న బిల్డప్ చిన్నాలు 420లని అటువంటి వారు తమ నాయకులను విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే నాలుక కోస్తామన్నారు. తమ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీపై ట్రోల్ చేస్తున్నారని మాట్లాడిన 420లకు చెబుతున్నామని మీ నేత జగన్ లా తల్లిని ,చెల్లిని ట్రోల్ చేయించి బయటకు గెంటేసే సంస్కృతిక తమ నాయకులకు లేదన్నారు. చాపల చిన్నరాజు మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో నిత్యం ప్రజల్లో ఉండే ఆదిరెడ్డి వాసును ఎదుర్కొనే సత్తాలేక అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. 75 వేల మెజార్టీలో వాసు ఎమ్మెల్యే కాబోతున్నారని దమ్ముంటే ఎదుర్కోవాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సలాది ఆనంద్, కందికొండ అనంత్, తాడి దుర్గాప్రసాద్, బూరా రమణ, కానేటి ప్రభుదాస్, శ్రీకాంత్, ఆనంద్, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

గోకవరం, మార్చి 2: గోకవరంలోని ఊర కాలువ గట్టు సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామి వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ నిర్మాత దాసరి రాఘవ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు హజరై ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలను అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 13మంది గైర్హాజరు

గోకవరం/రంగంపేట, మార్చి 2: గోకవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్షకు 263 మందికి గాను 254 మంది, బీఎస్ఆర్ కళాశాల్లో పరీక్షకు 220 మందికి గాను 214 మంది హాజరయ్యారు. రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 404 మంది విద్యార్థులకు గాను 393 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు.

బంగారు షాపులో చోరీ

కోరుకొండ, మార్చి 2: కోరుకొండ మసీదు సమీపంలోని బంగారు షాపులో దుండగులు చోరీకి పాల్పడ్డారు. 200గ్రాముల బంగారం, సుమారు రూ.లక్ష నగదు అపహరించారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు శనివారం తెలిపారు. దుండగులు స్థానిక అయ్యప్ప జ్యూయలరీ షాపు షట్టర్ తాళాలు పగలగొట్టి కొన్ని బంగారు వస్తువులు, నగదు అపహరణకు గురైనట్టు సీఐ అడపా నాగ మురళి విలేఖరులకు తెలిపారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరిస్తుందని ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఇంటింటి సర్వే

దివాన్‌చెరువు, మార్చి 2: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం-1 ఆధ్వర్యంలో దివాన్‌చెరువులో సచివాలయం-2 పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండో రోజైన శనివారం విద్యార్థులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల మాట్లాడుతూ దివాన్‌చెరువు అభివృద్ధికి ఈ ప్రత్యేక శిబిరం దోహదపడుతుందని చెప్పారు. ఈ శిబిరంలో ఈ నెల 7వ తేదీ వరకూ నిర్వహించే కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ పీవో ఎస్.రాజ్యలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ధవళేశ్వరం, మార్చి2: ధవళేశ్వరంలో రూ.5.10 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి కల్పన పనులకు శనివారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శంకుస్థాపనలు చేశారు. జనార్ధనస్వామి కాలనీలో సీసీ రోడ్డు, కేతావారి వీధి, సుబ్బయ్యమ్మ వీధి, సున్నం బట్టీ వీధి, కొత్తపేటలలో డ్రైన్‌ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమావేశానికి ఆయన విచ్చేసి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో నక్కా రాజబాబు, తలారి వరప్రసాద్, షట్టర్ బాషా, సాధనాల శివ, పి. రాజేష్, తేట రామకృష్ణ పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో బీజేపీ ప్రజాపోరు యాత్ర

ధవళేశ్వరం, మార్చి 2: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ప్రజాపోరు యాత్ర షేక్ షాజిత్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్, రథంవీధి సెంటర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ సంతోష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను వైసీపీ ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటుందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే బీజేపీని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్, ఒంటెద్దు స్వామి, కర్రి నాగిరెడ్డి, డాక్టర్ జి.కొండలరావు, కోన సతీష్ పాల్గొన్నార

బిక్కవోలులో మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం



బిక్కవోలు, మార్చి 2: బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8న నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసే అరపకు రాట వేసి ఉత్సవ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.రాంబాబురెడ్డి, వైస్ ఎంపీపీ కన్నారావు, వైసీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వరల్డ్ కిక్‌బాక్సింగ్ పోటీలకు సాయికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2: రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ 7వ తరగతి విద్యార్థి పి.సాయికృష్ణ వరల్డ్ కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడని ఆ స్కూల్ చైర్మన్ టికే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ విద్యార్థి ఇటీవల ఢిల్లీలో జరిగిన పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించి వరల్డ్ పోటీలకు ఎంపికకావడం గర్వకారణమన్నారు. సాయికృష్ణకు శిక్షణ ఇచ్చిన కోచ్ బి.శామ్యూల్ రాజును అభినందించారు. తమ స్కూల్‌లో ఆదివారం రోలర్ స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఎన్నికల్లో యువత భాగస్వాములు కావాలి

రాజమహేంద్రవరం రూరల్ మార్చి2: సార్వత్రిక ఎన్నికల్లో యువత భాగస్వాములు కావాలని, యువ ఓటర్లు బయటకు వచ్చి ఓటు వేసేలా ప్రజలను చైతన్యవంతులు చేయాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చావన్ శ్యామ్‌రాజ్ నాయక్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో గల వ్యవసాయ కళాశాలలో మేరా పెహ్లా ఒట్ దేశ్ కెలియా (నా మొదటి ఓటు దేశానికే) ప్రచార కార్యక్రమం శనివారం జరిగింది. ఎన్నికల ప్రాముఖ్యత.. దేశ భవిష్యత్ కోసం ఓటువేయడం వంటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.అమ్మాజి, డాక్టర్ రమేష్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి మహిళా క్రికెట్ టీంకు అభినందన

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 2 : ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిన దేవరపల్లి సచివాలయం మహిళల క్రికెట్ టీంకు కలెక్టర్ కె.మాధవీలత ట్రోఫీని అందజేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ చేతుల మీదుగా కెప్టెన్ చింతపల్లి కవిత, జట్టు సభ్యులు ట్రోఫీని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ కోచ్ బీఎంఎం శేషగిరి, క్రీడాధికారి వీజీ నాగేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువత భాగస్వాములు కావాలి

రాజమహేంద్రవరం రూరల్ మార్చి2: రాబోయే ఎన్నికల్లో యువత భాగస్వాములు కావాలని, యువ ఓటర్లు బయటకు వచ్చి ఓటు వేసేలా ప్రజలను చైతన్యవంతులు చేయాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చావన్ శ్యామ్‌రాజ్ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని కాతేరులో వ్యవసాయ కళాశాలలో మేరా పెహ్లా ఒట్ దేశ్ కెలియా (నా మొదటి ఓటు దేశానికే) ప్రచార కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రాముఖ్యతను దేశం భవిష్యత్ కోసం ఓటు వేయాల్సిన అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పి.అమ్మాజి, రమేష్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రూరల్ సీటు దుర్గేష్‌కు కేటాయించాలి


జనసైనికుల మౌన, కొవ్వొత్తులు ప్రదర్శన



కడియం మార్చి 2: రాజమహేంద్రవరం రూరల్ సీటును జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌కు కేటాయించాలంటూ ఆ పార్టీ నాయకులు శనివారం వేమగిరి జాతీయ రహదారి సమీపంలోని మైదానంలో జనసైనికులు మూతికి నల్లరిబ్బన్లు ధరించి మౌన ప్రదర్శన చేశారు. అనంతరం కొవ్వొత్తులు చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరు దుర్గేష్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. జనసేన పార్టీ రాజమహేంద్రవరం రూరల్‌లో బలమైన పార్టీగా వుందన్నారు. ఆయనకు సీటు కేటాయిస్తే విజయం ఖాయమని అన్నారు. సుమారు గంటపాటు వారంతా మౌన ప్రదర్శన ,కొవ్వొత్తుల ప్రదర్శన చేసారు. వారికి బాక్స్ ప్రసాద్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు ముద్రగడ జమి, రత్నం అయ్యప్ప, పంతం గణపతి, పుల్లా రామారావు, మార్గాని ఏడుకొండలు, గెడ్డంశివ గట్టి సుబ్బారావు, ఆదిమూలం సాయిబాబా, గట్టి నరసయ్య, జంగా వినోద్, తోరాటి శ్రీను, కొప్పిశెట్టి రాజేష్, ఇనుమర్తి ప్రభాత్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సిద్ధార్థనగర్‌కి చెందిన 20ఏళ్ల యువతి డిగ్రీ చదువుతోంది. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని శనివారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ పేర్కొన్నారు.



హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ
వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని భార్య హత్య 8



మోగింది కల్యాణ వీణ..

ఆకాశం దిగి వచ్చి మబ్బులతో వేయాలి మన పందిరి.. ఊరంతా చెప్పుకునే ముచ్చటగా జరగాలి పెళ్లంటే మరి.. నేడు పెళ్లంటే అచ్చంగా ఇలాగే చేస్తున్నారు.. ఆకాశమంత పందిరి వేసి.. భూదేవంత పీట వేసి వేడుకగా చేస్తు న్నారు.. అయితే అంతా ఆడంబరమే.. ప్రస్తుతం మాఘ మాసం కావడంతో ఎక్కడికక్కడ పెళ్లి బాజాలు మోగుతున్నాయి.. ఈ ఏడాది మాఘమాసంలో ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల పెళ్లిళ్లు జరిగినట్టు ఒక అంచనా.. ఇక మిగిలినవి మూడే ముహూర్తాలు..

- మాఘమాసంలో సందడే..సందడి
- జిల్లా వ్యాప్తంగా 2 వేల పెళ్లిళ్లు
- ఆడంబరంగా పెళ్లి వేడుకలు
- డబ్బులకు రాజీపడకుండా ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2 : మాఘమాసం కోసం ఎదురుచూడని వారుండరు.. ఎందుకంటే ఎక్కువగా శుభకార్యాలు జరిగేది ఈ మాసంలోనే.. మాఘమాసం కోసం ఏడాదంతా ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం ఉన్నది ఆ మాసంలోనే.. అందుకే ఎటు చూసినా పెండ్లి సందడే.. ఈ నెలలోనే ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల వివాహాలు జరిగినట్టు సమాచారం. గతంలో పెళ్లంటే వారం రోజుల వేడుక... పెళ్లంటే పందిళ్లు..తాళాలు.. తలంబ్రాలు.. విందులు..వినోదాలు..బంధువర్గాల సందడితో రెండు కుటుంబాలు ఆనందంగా నిండు నూరేళ్ల గుర్తుగా జరుపుకునే పండుగ.. నాడు సంప్రదాయ పద్ధతిలో వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించేవారు. వధూవరుల ఇళ్ల ముగింట రాట ముహూర్తం చేసుకుని తాటాకు, కొబ్బరి ఆకు పందిళ్లు వేసుకుని నెల రోజుల ముందు నుంచి ఏర్పాట్లు చేసుకునేవారు. ఇంటి ముంగిట మంటపం ఏర్పాటు చేసుకుని వివాహ వేడుక అద్భుతంగా నిర్వహించేవారు... కానీ నేటి ఆధునిక యుగంలో పెళ్లంటే మెహందీ.. ఎల్లోడే.. బ్యాచిలర్ డే అంటూ రకరకాల పేర్లతో బంధువులను పిలుచుకుని వారం రోజుల పాటు వేడుకగా చేస్తున్నారు..అయితే అదంతా గంట తంతు..రెండు గంటల పాటు భోజనాలు.. అరగంట ఆర్కెస్ట్రాతో ముగిస్తున్నారు. పెళ్లి రోజు ఫంక్షన్ హాలులో కార్యక్రమం ముగించుకుని ఇంటికి వెళ్లిపోతున్నారు. ఎక్కువ శాతం ప్రజలు ఫంక్షన్ హాల్స్‌లో పెండ్లి వేడుకలను నిర్వహించుకునేందుకు ముక్కువ చూపడంతో ఏ ఊళ్లో చూసినా వందల సంఖ్యలో కల్యాణ మంటపాలు పుట్టుకొచ్చాయి. అన్నీ రెడీమేడ్ కావడంతో కేవలం వధూవరుల కుటుంబాలు రెడీ అయ్యి వెళ్లడమే పనులన్నీ క్షణాల్లో అయిపోతున్నాయి..పెళ్లంటే జీవితంలో అత్యంత కీలకమైనది కావడంతో వధూవరులు ఎక్కడా రాజీ పడడం లేదు. ఆనందంగా వేడుకగా జరుపుతున్నారు. పైగా పెళ్లి గ్రాండ్‌గా జరపడం ఇప్పుడు స్టేటస్ సిబంల్ కావడంతో ఖర్చుకు వెనుకాడకుండా లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. కోట్లలో ఖర్చు పెట్టిన పెళ్లి వేడుకలు కూడా ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో..

పెళ్లి సందడి మొదలుకావడంతో జిల్లా వ్యాప్తంగా కల్యాణ మంటపాలు కళకళలాడుతున్నాయి. ఈ రోజుల్లో కల్యాణ మంటపం అంటే రూ.50 వేలు మొదలుకొని రోజుకు రూ.5లక్షల వరకు అద్దెలు ఉన్నాయి. అయినా ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు. ప్రజలు వారి ఫంక్షన్ స్థాయి బట్టి వాటిని ఎంపిక చేసుకుంటున్నారు.అయితే సామాన్యులకు వీటి ధరలు అందుబాటులో లేకపోవడం కొంత ఇబ్బందికర పరిస్థితే. ఇక విందు భోజనం అదరగొడుతున్నారు.. ఎంత పెట్టామా కాదు.. ఎన్ని వెరైటీలు పెట్టామా అనేదే ఆలోచిస్తున్నారు. పెళ్లి భోజనం ఏమి పెట్టాడురా అని నలుగురు నాలుగుకాలల పాటు చెప్పుకునేలా ఖర్చుకు వెనుకడుగు వేయని కుటుంబాలు అనేకం ఉన్నాయి. పలు కుటుంబాల్లో వివా హాది శుభాకార్యాలు జరిగినప్పుడు 25 నుంచి 50 రకాలు వడ్డించే వారూ ఉన్నారు. దీంతో వాటికి తగ్గట్టుగా భోజనాలు తయారు చేసే కేటరింగ్‌లు జిల్లాలో అన్ని చోట్ల సిద్ధమయ్యాయి. వివాహాది శుభాకార్యాలకు గతంలో వంట మనిషిని పెట్టుకుని వండివార్చి భోజనాలు పెట్టేవారు. కాని నేటి ప్రపంచంలో అన్నీ కేటరింగే.. ముందుగా ఎంతమంది వస్తారో పురమాయిస్తే నిర్వాహకులు తయారు చేసి కల్యాణమంటపానికి హాట్ బాక్స్‌లో తీసుకువచ్చేస్తున్నారు. ఆకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ ఉందంటే ఆశ్చర్యపోనవసరం లేదు. దీంతో వధూవరుల కుటుంబాలకు వంటవార్పు పర్యవేక్షణ పని లేకుండా పోయింది. పెళ్లంతా రెడీమేడ్‌గా జరిగిపోతోంది..



ఇక మిగిలిన ముహూర్తాలు మూడే..

ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీ వరకు ముహూర్తాలు ఉన్నాయి. మార్చి 2 వ తేదీన పదుల సంఖ్యలో పెళ్లిళ్లు జరిగాయి. మార్చి 6వ తేదీన , ఏప్రిల్ 5వ తేదిన, 20వ తేదీన పెద్దముహూర్తలు ఉన్నాయి. ఈ ఏడాది ఇంకా మూడే ముహూర్తాలు మిగిలి ఉన్నాయి. ఆయా ముహూర్తాల్లో వివాహాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సుమారు రెండు నెలల పాటు సాధా రణ ముహూర్తాలతో పాటు పెద్ద ముహూర్తాలు ఉండటంతో బాజా భజంత్రీలు.. మేళతాళాలతో జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి నెలకొంది.



నేడు పల్స్ పోలియో కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 2 : జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నామని, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 0-5 ఏళ్లలోపు చిన్నారులు 1,90,479 మంది ఉన్నారన్నారు. వీరికి పోలియో చుక్కలు వేయడానికి 1,060 కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటితో పాటు 60 ట్రాన్సిట్ టీంలు, 40 మొబైల్ టీంలు కూడా సిద్ధం చేశామని తెలిపారు. 3న పోలియో కేంద్రాల వద్ద చుక్కలు వేస్తారని,ఎవరైనా మిగిలిపోతే 4,5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. రాజమహేంద్రవరం 5వ డివిజన్ కంబాలపేట అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్ వద్ద ఆది వారం ఉదయం 9 గంటలకు పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

గోదారిలో దూకిన మహిళ గల్లంతు!

రాజమహేంద్రవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రోడ్ కం రైలు బ్రిడ్జిపైన 53వ స్తంభం దగ్గర శనివారం సాయంత్రం ఓ మహిళ గోదావరిలో దూకి గల్లంతైనట్టు సమాచారం.ఈ మేరకు టూటౌన్ పోలీసులు అప్రమత్తమై ఈతగాళ్ల సహాయంతో వెతికించినా ఫలితం లేదు. ఆమె బం ధువులెవరూ స్టేషనుకు రాలేదని పోలీసులు తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.ఆమె సచివాల యంలో పనిచేస్తారని సోషల్ మీడియాలో పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

రాజమహేంద్రవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కంబాలపేటకు చెందిన నంది స్వామినాథం(58) ఇన్నీసుపేటలోని ఉపాధ్యాయ శిక్షణ కళాశాల(బీఈడీ ట్రైనింగ్ కాలేజీ)లో రికార్డు అసిస్టెంటుగా విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం విధులకు వచ్చిన స్వామినాథం కళాశాల గ్రంథాలయం పక్కన ఉన్న గదిలో ఉరి వేసుకున్న స్థితిలో గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పుల్లారావు తెలిపారు.



పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న సీనియర్ ఇంటర్ విద్యార్థులు

ఇంటర్ పరీక్షకు 353 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు రెండో ఏడాది విద్యార్థులకు శనివారం నుంచి ఆరంభమయ్యాయి. 15954 మంది జనరల్ విద్యార్థులకు 15,679.. ఒకేషనల్ 1495కి 1417 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రాంతీయ పర్యవేక్షకులు ఎన్ఎస్‌వీఎల్ నరసింహం పేర్కొన్నారు.52 సెంటర్లలో పరీక్షలు జరిగాయన్నారు. మొత్తంగా 353 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోలేదని తెలిపారు.

భార్యకు మందులు కొనలేక...
భర్త ఆత్మహత్య



అనపర్తి,మార్చి 2 : భార్యకు మందులు కొనుగోలు చేయలేక ఒక భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనపర్తి ఏఎస్ఐ వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం. అనపర్తిలోని బాపనమ్మ ఆల యం సమీపంలో నివాసం ఉంటున్న సత్తి గంగిరెడ్డి(61) కూలీ నాలీ చేసుకుని జీవనం సాగించేవాడు. ఇటీవల కాలంలో అతని భార్య అనారోగ్యం భారిన పడడం నెలసరి మందులు కొనేందుకు కూడా స్థోమత లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇదిలా ఉండగా శనివారం అనపర్తి శివారులోని ఎఫ్‌సీఐ గొడౌన్స్ సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో సపోట చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకుని మృతుడు వివరాలకు ఆరా తీయగా గంగిరెడ్డిగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. మృతుడి భార్య మంగయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఏఎస్ఐ తెలిపారు.

ఓటుకు.. రె..ఢీ!



- ఎన్నికల యుద్ధానికి సంసిద్ధం
- ఓటర్ల ఎదురుచూపులు
- సన్నద్ధమైన అధికార యంత్రాంగం
- జిల్లాలో 16 లక్షల మంది ఓటర్లు
- 1569 పోలింగ్ కేంద్రాలు
- 336 సమస్యాత్మక కేంద్రాలు
- 9809 మంది ఉద్యోగులకు బాధ్యత
- కొనసాగుతున్న ఎన్నికల శిక్షణ
- అభ్యర్థుల్లో.. టిక్కెట్ల టెన్షన్
- ఈ నెల రెండో వారమే నోటిఫికేషన్?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఎవరి నోట విన్నా ఎన్నికల మాటే..ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయిరా దేవుడా అన్నట్టు చూస్తున్నారు.జిల్లా ఎన్నికల యంత్రాంగం ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు.ఎన్నికల ఏర్పాట్లు ఇంచుమించు పూర్తి కావొస్తున్నాయి.జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా. కె.మాధవీలత నిత్యం ఏదో చోట ఎన్నికల ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమించి శిక్షణ ఇస్తున్నారు. పోలింగ్ నిమిత్తం 1569 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఓటు వేసిన తర్వాత ఈవీఎంలు భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధం చేశారు.ఏ నియోజకవర్గానికి కౌంటింగ్ ఎక్కడ చేయాలనేది నిర్ణయించి..నన్నయ వర్సిటీలో ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 336 సమస్యాత్మక కేంద్రాలు..

రాజానగరం నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాల్లో 10 అతి సమస్యాత్మక, 50 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. అనపర్తిలో 228 పోలింగ్ కేంద్రాలు ఉండగా 67 సమస్యాత్మ కేంద్రాలుగా ఉన్నాయి. రాజమహేంద్రవరం సిటీలో 232 కేంద్రాలు ఉండగా 13 అతి సమస్యాత్మక, 36 సమస్యాత్మక కేంద్రాలుగా విభజించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 264 కేంద్రాలు ఉండగా 7 అతిసమస్యాత్మక, 15 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాలు ఉండగా 35 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. నిడదవోలులో 205 కేంద్రాలు ఉండగా 41 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. గోపాలపురంలో 248 కేంద్రాలు ఉండగా 62 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. మొత్తం జిల్లాలో 1569 పోలింగ్ స్టేషన్లకు 30 అతి సమస్యాత్మక కేంద్రాలు 306 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి.మిగతా 1263 సాధారణ కేంద్రాలుగా గుర్తించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 9809 మంది ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569, ఇతర పోలింగ్ అధికారులు 6276,మైక్రో అబ్జర్వర్లు 395 మందిని నియమించారు.

జిల్లాలో మహిళలదే పైచేయి..

ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడొస్తుందోనని ఓటర్లు ఎదురు చూస్తున్నారు. రాజకీయ పార్టీలు షెడ్యూల్‌కు ఎదురు చూస్తున్నాయి. ఈ నెల రెండో వారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని సమాచారం. ఇదిలా ఉం డగా అభ్యర్థులు, ఎంపీ బరిలో నిలబడలాలనుకునేవారు మాత్రం టిక్కెట్లు ఎప్పుడు ఖరారు చేస్తారోనని టెన్షన్ పడుతున్నారు.సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో ఓటర్ల జాబితా సిద్ధ మైంది. 2024 ఎస్ఎస్ఆర్ తుది ఓటర్ల జాబితా జిల్లాలో మొత్తం 16,05,762 మంది ఓటర్లు ఉన్నారు.అందులో పురుషులు 7,85,142 మంది, మహిళలు 8,20,515 మంది, థర్డ్ జండర్ 105మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 35,373 మంది ఎక్కు వగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ.జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉండగా అత్యధిక ఓటర్లు రాజమహేంద్రవరం రూరల్‌లో ఉన్నారు.నియోజకవర్గంలో 2,71159 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1,38,604 మంది, పురుషులు 1,32,531 మంది, థర్డ్ జండర్ 24 మంది ఉన్నారు. అతి తక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు. ఇక్కడ మొత్తం ఓటర్లు 1,83,405 మంది. పురుషులు 89,442, మహిళలు 93,958 , థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఓటర్ల సంఖ్య పరంగా రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 2,60360 మంది ఓటర్లు ఉన్నారు. మహిళలు 1,34,663 మంది, పురుషులు 1,25,639 మంది, థర్డ్ జండర్లు 58 మంది ఉన్నారు. గోపాలపురం నియోజ కవర్గం ఓటర్ల పరంగా మూడో స్థానంలో ఉంది. ఇక్కడ 2,41,798 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,18,783 మంది, మహిళలు 1,23,008 మంది, థర్డ్ జెండర్ ఏడుగురు ఉన్నారు. అనపర్తి నాలుగో స్థానంలో ఉంది. ఇక్కడ 2,23,255 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,09,323, మహిళలు 1,13,930, థర్డ్ జెండర్ ఇద్దరు ఉన్నారు. రాజానగరం ఐదో స్థానంలో ఉంది. మొత్తం ఓటర్ల సంఖ్య 2,60,360. పురుషులు 1,05,824, మహి ళలు 1,08,083, థర్డ్ జెండర్ నలుగురు ఉన్నారు. నిడదవోలు ఆరో స్థానంలో ఉంది. మొత్తం 2,11,874 మం ది ఓటర్లు ఉండగా పురుషులు 1,03,600, మహిళలు 1,08,269 మంది ఉన్నారు. కొవ్వూరు అతి తక్కువ ఓటర్లతో చివరి స్థానంలో ఉంది. ఓటర్ల తుది జాబితా ప్రకటించినప్పటికీ నామినేషన్ల చివరిరోజు వరకూ ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. జనవరి 22న తుది జాబితా ప్రకటించేనాటికి 5506 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి కాకుండా అప్పటి నుంచి ఇప్పటి వరకూ కొత్తగా ఓటర్లు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు 46,091 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో పరిష్కరించాల్సినవి 9,015 ఉన్నాయి.వాటిలో ఫారమ్-6లు 1752, ఫారమ్-7 5533, ఫారమ్-8 1730 ఉన్నాయి.

జిల్లాలో 232 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు : కలెక్టర్

1రాజమహేంద్రవరం, మార్చి2(ఆంధ్రజ్యోతి) : ఓటర్లు దగ్గరలోనే సత్వరం ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరణచేసి, జిల్లాలో 232 కేంద్రాల పేర్లు మార్చడంతో పాటు 17 లొకేషన్లు మార్చినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం సాయం త్రం వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 1500 కంటే ఎక్కువమంది ఓటర్లు ఉన్న 8 పోలింగ్ కేంద్రాలకు అదనపు స్టేషన్లు ఏర్పాట్లు చేయనున్నామన్నారు. రాజమహేంద్రవరం సిటీలో పోలింగ్ స్టేషన్లు 14, 17, 29, 155, 168 , రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో 17, 30, 31, కేం ద్రాలకు అదనంగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామ న్నారు. అక్కడ ఉదాహరణకు 14 కేంద్రానికి అదనంగా 14ఎ కేంద్రం ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు, మీడియాతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులు కొత్త బ్యాంక్ ఖాతా తెరవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఆర్‌వో జీ.నరసింహులు, సీఎస్ డీటీ కృష్ణనాయక్, రాజకీయ నాయకులు నలబాటి రమేష్ (కాంగ్రెస్), బి. రామ చంద్రారావు (బీజేపీ),చెల్లుబోయిన శ్రీనివాసరావు(టీడీపీ), కెఆర్ జయకర్(వైసీపీ), అర్బన్ తహశీల్దార్ కె.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భలే మంచి.. మాస్టారు!



విద్యార్థులతో పాటు తరగతి గదిలో కూర్చుని పాఠాలు వింటున్న డీఎస్ఈవో వాసుదేవరావు

ఈ చిత్రంలో చూస్తున్నారుగా ఈయనెవరో గుర్తుపట్టారా.. ఈ వయసులో 7వ తరగతి చదవడానికి వెళ్లారా ఏమిటని ఆశ్చర్యపోతున్నారా.. అలా కాదండోయ్.. ఆయన డీఎస్ఈవో వాసుదేవరావు.. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలను తనిఖీ చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం కొవ్వూరు మండలం పంగిడి జడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మి తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి.. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు రాగి జావ అందిస్తున్నారా లేదా అని మధ్యాహ్న భోజన పదకం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు పాఠాలు సరిగా చెబుతున్నారో లేదోనని 7,9 తరగతి గదుల్లో భోదన తరగతులను విద్యార్థులతో పాటు కూర్చుని ఆలకించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డు పనితీరును పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు.. వారి పుస్తకాలను పరిశీలించారు.. బాగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని అన్నారు. కొంత మంది ఆకతాయిలు పాఠశాలలో టాయిలెట్స్‌ను ధ్వంసం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఎం. రామారావు, ఈ.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. - కొవ్వూరు



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు

నగరంలో బ్లేడ్ బ్యాచ్‌గాళ్లు 1180 మంది

- రాజకీయ నాయకుల అండతో పేట్రేగిపోతున్నారు
- రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పోలీసు రికార్డుల ప్రకారం బ్లేడ్‌బ్యాచ్, గంజాయి తదితర అరాచక వ్యక్తులు నగరంలో 1180 మంది ఉన్నారని, ఇప్పటికే సెంట్రల్ జైలులో 350 మంది ఉన్నారని ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. ఆయన 24వ వార్డులో పర్యటిస్తున్న సమయంలో ప్రజలు సమస్యలు ఏకరువు పెట్టారు. రంభ,ఊర్వశి,మేనక థియేటర్ల సమీపంలో ఉన్న ప్రధాన కూరగాయల మార్కెట్ జట్టు కూలీలు బ్లేడ్‌బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని ఎంపీకి తెలిపారు. ఉపాధి కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చామని.. కష్టపడితే రోజుకు రూ.500 గిట్టుబాటు అవుతుందన్నారు. అవి కూడా రాత్రులు తాము ఇళ్లకు వెళ్లే సమయంలో బ్లేడ్‌బ్యాచ్‌గాళ్లు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.బ్లేడ్‌బ్యాచ్,గంజాయిబ్యాచ్, రౌడీషీటర్లను రాజకీయ నాయకులే పెంచి పోషిస్తున్నారని..వారి అండతోనే పేట్రేగిపోతున్నారని కూలీలతో ఎంపీ అన్నారు. దీంతో ఆశ్చర్యపోవడం కూలీల వంతు అయింది.అసాంఘిక వ్యక్తుల నుంచి రక్షణ కల్పించే విషయాన్ని పక్కనబెట్టి ఎన్నికల ప్రసంగంతో సరిపెట్టడంతో కూలీలు విస్మయం వ్యక్తం చేశారు.

వివేకా హత్య కేసులో జగన్ పాత్రపై విచారణ జరిపించాలి : టీడీపీ ద్విసభ్య కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

కొవ్వూరు, మార్చి 2: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరిపించాలని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంట మణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి మాయమాటలు నమ్మి ప్రజలు మరోసారి వైసీపీకి ఓటు వేస్తే రాష్ట్రం రావణ కాష్టమవుతుందన్నారు. గత ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసమే జగన్ ముఠా వివేకానందరెడ్డిని హతమార్చారన్నారు. సానుభూతి ఓట్లతో అధికారం చేపట్టి ఐదేళ్లు పూర్తవుతున్న సొంత బాబాయి హత్యకేసును ఛేదించకుండా, హత్యచేసిన వారిని వేనకేసుకుని వచ్చి శిక్ష పడకుండా కాపాడుతున్న జగన్‌రెడ్డి నిజమైన నేరస్తుడన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, పొట్రు శ్రీనివాస్, వేమగిరి వెంకట్రావు, వరిగేటి కాంతరాజు, కిలాని రమణ, కొక్కిరిపాటి వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 9 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 2: కొవ్వూరు పట్టణ, మండలంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. 465 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 456 మంది హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 300 మందికి గాను 293 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 165 మందికి గాను 163 మంది హాజరయ్యారు.

గోపాలపురం: గోపాలపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల, గౌతమి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గురుకుల పాఠశాలలో 378మంది విద్యార్థులకు గాను 12మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ ఉమాదేవి తెలిపారు. గౌతమి కళాశాలలో 326 మందికి గాను 8మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ సీవీ రమణ తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు

కొవ్వూరు, మార్చి 2: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఇష్టపడి చదివితే విజయం వరిస్తుందని కొవ్వూరు భారత వికాస పరిషత్ అధ్యక్షుడు జీబీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు శనివారం మోటివేషన్ తరగతులు నిర్వహించి, అల్పాహారం అందజేశారు. విద్యార్థులు ఒత్తిడిని జయించేందుకు అవసరమైన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వై.రమేష్, ఎస్.రాఘవేంద్ర, హెచ్ఎం వి.గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాలు



నిడదవోలు, మార్చి 2: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్యభూమిక వలంటీర్లదేనని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలులోని రోటరీ ఆడిటోరియమ్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థకు ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్ల సేవలు ఎంతో విలువైనవన్నారు. ఉత్తమ సేవలందించిన పలువురు వలంటీర్లను సేవా మిత్ర, సేవా వజ్ర, సేవా రత్న అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్లు యలగాడ బాలరాజు, గంగుల వెంకటలక్ష్మి, గాజుల రంగారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులను ఢీకొన్న కారు

ఐదుగురికి గాయాలు.. మద్దూరులంక బ్యారేజీపై ఘటన



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కొవ్వూరు, మార్చి 2: కారు ఢీకొని ఐదుగురు విద్యార్థులు గాయపడిన సంఘటన కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఆజ్జ గ్రామానికి చెందిన సూరిశెట్టి సీతామహాలక్ష్మి, అల్లం మనోజ్‌కుమార్, ఆకుల రామ వెంకటదుర్గ, రెంపా విర్షిత్, కె.అఖిల్ సైకిళ్లపై శనివారం ఉదయం మద్దూరులోని హైస్కూల్‌కు బయలుదేరారు. బ్యారేజ్‌పై వెనుక నుంచి వస్తున్న కారు విద్యార్థులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు కింద పడి గాయాలపాలయ్యారు. దీంతో వారిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటదుర్గ, సీతామహాలక్ష్మిలకు బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరం రిఫర్ చేశారు. అల్లం మనోజ్‌కుమార్ తండ్రి చిట్టివీరన్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

నేడే పల్స్‌పోలియో

కొవ్వూరు, మార్చి 2: ఈ నెల 3వ తేదీన దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలు 4485 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యం నిర్దేశించినట్టు వైద్యాధికారి డాక్టర్ ఎస్.ధర్మరాజు తెలిపారు. ఆదివారం నుంచి 3 రోజులపాటు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పల్స్‌పోలియో నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం 28 బూత్‌లు ఏర్పాటుచేసి పోలియో చుక్కలు వేయనున్నట్టు చెప్పారు. ఆదివారం అందుబాటులో లేని పిల్లలకు మార్చి 4, 5 తేదీల్లో ఆశ, ఏఎన్ఎం, ఎమ్ఎల్‌హెచ్‌పీలతో కూడిన బృందాలు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు. పిల్లలకు తల్లితండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

గోపాలపురం, మార్చి 2: గోపాలపురం శివారు పొగాకుబోర్డు సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ కే.బాలసురేష్‌బాబు వివరాల ప్రకారం.. చాగల్లు గ్రామానికి చెందిన ఆంజనేయులు దేవరపల్లి నుంచి ద్విచక్రవాహనంపై గోపాలపురం వైపు వస్తుండగా గోపాలపురం వైపు నుంచి వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. ఆయన వెంట ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఉన్నారు.

పాత పింఛన్ విధానం టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలి

మద్దిపాటికి యూటీఎఫ్ నాయకుల వినతి

నల్లజర్ల, మార్చి 2: పాత పింఛన్ విధానాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని యూటీఎఫ్ నాయకులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజుకు వినతిపత్రం అందించారు. శనివారం నల్లజర్ల పార్టీ కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు మద్దిపాటితో మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుని వచ్చిన నూతన పింఛన్ విధానం ఉద్యోగులకు ఏమాత్రం లాభసాటిగా లేదన్నారు. అలాగే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేసి పెన్షన్, గ్రాట్యూటీ కల్పించాలన్నారు. రాష్ట్రంలో రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులందరికి పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ మనోహర్‌కుమార్,పల్లి వెంకట అప్పారావు, బండి కిషోర్ పాల్గొన్నారు.

వినాయకుడి ఆలయానికి రూ.1.50 లక్షల విరాళం

నల్లజర్ల, మార్చి 2: మండలంలోని చీపురుగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న వినాయకుడి ఆలయానికి గ్రామానికి చెందిన చెల్లు వీరవెంకట్రావు, పెద్ద రామన్న, ఈశ్వర్, వెంకటరాయుడు కుమారులు రామకృష్ణ, చంటి, పసుపులేటి రత్నకుమారి, గోలి గౌరీదేవి వారి తల్లిదండ్రులు చెల్లు శ్రీరామూర్తి, సున్యకాంతమ్మ జ్ఞాపకార్థం రూ1.50 లక్షలు విరాళం అందించారు.

వల్లీదేవసేన విగ్రహ ప్రతిష్ఠ

తాళ్లపూడి, మార్చి 2: మండలంలోని బల్లిపాడులో విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని నూతన విగ్రహాలకు అర్చకులు క్షీరాధివాసం, ధాన్యాధివాసం, జలాధివాసం కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకూడదు

- మహాశివరాత్రి ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ
- అధికారులతో కలిసి కొవ్వూరు గోష్పాదక్షేత్రం సందర్శన



గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, మార్చి 2: మహాశివరాత్రి సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కొవ్వూరు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. మహాశివరాత్రికి కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై ఆయన శనివారం అధికారులతో కలిసి క్షేత్రంలో పర్యటించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. స్నానఘట్టాల్లో ఇసుక మేటలను తొలగించి, ఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలని, భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలు ఏర్పాటు చేయాలన్నారు. నదిలో ప్రమాదాలు జరగకుండా మెస్‌లు, పడవలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్త్రీలు బట్టలు మార్చుకునే గదులు సమకూర్చాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తుతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటుచేయాలన్నారు. అలాగే డివిజన్ పరిధిలోని వేగేశ్వరపురం, తాళ్లపూడి, ప్రక్కిలంక, వాడపల్లి, సిద్ధాంతం, పెండ్యాల, ముక్కామల గోదావరి స్నానఘట్టాలను శుభ్రపరిచి, లైటింగ్, పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాలని డివిజనల్ పంచాయతీ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, డీఎస్పీ కె.రామారావు, మున్సిపల్ కమిషనర్ కె.డానియల్ జోసఫ్, సీఐ వి.జగదీశ్వరరావు, ఏజీఆర్‌బీ ఏఈ సునీల్‌కుమార్, ఎలక్ట్రికల్ ఏఈ డి.జగదీశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ జి.రాధాకృష్ణ, తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంటు అజయ్, శివాలయం అర్చకుడు మానేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుందరబాబు



దేవరపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

దేవరపల్లి, మార్చి 2: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, జీవో 12, 14ను రద్దు చేసి కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.సుందరబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దేవరపల్లి బస్టాండ్ వద్ద భవన నిర్మాణ కార్మికులు రిలే నిరసన దీక్ష చేపట్టారు. వీరికి మద్దతుగా సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.సుందరబాబు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమబోర్డు ద్వారా రాష్ట్రంలో పదేళ్ల పాటు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని, జగన్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారని విమర్శించారు. కార్మికులకు పనులు కల్పించడంలో, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సువర్ణరాజు మాట్లాడుతూ జగన్ నూతన ఇసుక పాలసీ అంటూ ఉచిత ఇసుకను వ్యాపారం చేశారని, గతంలో కంటే 100శాతం అధిక ధరలకు విక్రయిస్తున్నారని విమర్శించారు. కార్మిక సంక్షేమ బోర్డు పూర్తిగా నిలిపివేసి 30లక్షల మంది కార్మికులకు అన్యాయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు ఐనపర్తి శ్రీను, సత్యనారాయణ, భగత్, కే.ఏసుబాబు, రత్నాజీ, సాధనాల పండు, వెంకటరమణ, ఎం.శ్రీనుబాబు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని..

భార్యను చంపేశాడు

ఆపై ఆత్మహత్యగా చిత్రీకరణ.. పోలీసు విచారణలో నేరం అంగీకారం



తానెం లక్ష్మి (ఫైల్ ఫొటో)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నల్లజర్ల, మార్చి 2: తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని ఓ భర్త తన భార్యను అత్యంత క్రూరంగా కొట్టి చంపేశాడు. వివరాలిలా ఉన్నాయి. నల్లజర్ల మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన తానెం విష్ణు ఆయిల్‌పామ్ గెలల కోత కార్మికుడిగా చేస్తున్నాడు. 2012లో అదే గ్రామానికి చెందిన లక్ష్మి(28)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. లక్ష్మి గత ఆదివారం జంగారెడ్డిగూడెంలో ఉంటున్న తన సోదరి పెద్దింట్లు ఇంటికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సమయానికి విష్ణు తన ఇంట్లో వేరే మహిళతో ఉండడం చూసి గొడవ పడింది. అప్పటి నుంచి ప్రతిరోజూ ఏదొక సమయంలో గొడవలు పడుతున్నారు. తమ వివాహేతర బంధానికి భార్య అడ్డుగా ఉంటుందని భావించిన విష్ణు శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో భార్య నోట్లో గుడ్డలు కుక్కి అత్యంత దారుణంగా చిత్ర హింసలకు గురి చేసి చంపేశాడు. మృతదేహాన్ని ఫ్యాన్‌కి వేలాడదీసి ఆత్మహత్య చేసుకున్నట్టు చిత్రీకరించాడు. అదే గ్రామంలో చదువుతున్న కుమార్తె మహి, కుమారుడు రాంచరణ్‌ను పిలిచి.. అమ్మమ్మ ఇంటికి వెళ్లి అమ్మ ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని చెప్పమని కబురు పంపించాడు. వారంతా వచ్చి చూడగా లక్ష్మి ఫ్యానుకు ఉరితో వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. భర్తపై అనుమానంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టీవీ సురేష్ మృతదేహాన్ని పరిశీలించగా శారీరమంతా గాయాలు ఉండడం గమనించి హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విష్ణును పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తానే హత్య చేసినట్టు అంగీకరించాడు.

టీడీపీ నిడదవోలు సీటు శేషారావుకే ఇవ్వాలి

- వేలివెన్ను వెళ్లిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- బూరుగుపల్లి ఇంటి వద్ద నినాదాలు.. సముదాయించిన మాజీ ఎమ్మెల్యే



వేలివెన్నులో శేషారావు ఇంటికి ర్యాలీగా వస్తున్న టీడీపీ శ్రేణులు



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న శేషారావు

ఉండ్రాజవరం, మార్చి 2: నిడదవోలు టీడీపీ అభ్యర్థిగా గెలిచే వ్యక్తి బూరుగుపల్లి శేషారావుకే టిక్కెట్ ఇవ్వాలని కోరుతూ నియోజవర్గంలోని టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున ర్యాలీగా శనివారం సాయంత్రం శేషారావు ఇంటికి వచ్చారు. జై చంద్రబాబు.. జై పవన్‌కల్యాణ్, జై బూరుగుపల్లి.. శేషారావు నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. నిడదవోలు నియోజకవర్గానికి ఉమ్మడి అభ్యర్థిగా శేషారావును ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని, ప్రత్యర్థిపై గెలిచే సత్తా ఉన్న మనిషి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల అండ మెండుగా ఉన్న వ్యక్తి ఆయనేనన్నారు. కొన్నేళ్లుగా నియోజవర్గ అభివృద్ధికి పాటుపడుతూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉన్న వ్యక్తి శేషారావుకు సీటు ఇవ్వాలన్నారు. టీడీపీ-జనసేన తొలిజాబితాలో శేషారావు పేరు లేకపోవడం నిరాశ కలిగించిందని నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ర్యాలీగా వచ్చిన టీడీపీ శ్రేణులను శేషారావు వచ్చి సముదాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజవర్గంలోని టీడీపీ బలోపేతానికి పాటుపడుతున్న కార్యకర్తల మనోభావాలను అనుగుణంగా నడుచుకుంటానన్నారు. కష్టపడేవారిని పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందన్నారు. సంయమనం పాటించాలని కార్యకర్తలను కోరారు. నియోజవర్గ అభ్యర్థి మార్పుపై తనకు అధిష్ఠానం నుంచి ఎటువంటి సమాచారం రాలేదన్నారు. సోషల్ మీడియాల్లో వచ్చే అపోహలను నమ్మవద్దన్నారు. మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ నియోజవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోరిక మేరకు శేషారావును అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నిడదవోలు పట్టణ, రూరల్, ఉండ్రాజవరం, పెరవలి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



చోరీ కేసులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ రామారావు

గోపాలపురం, మార్చి 2: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సీకే గౌతమ్‌రాజ్, కేఏస్ వినయ్‌కుమార్ పువ్వుల వ్యాపారంలో నష్టం రావడంతో అధిక ధనార్జన కోసం గంజాయి వ్యాపారానికి తెరదీశారు. ముందస్తు సమాచారంతో శుక్రవారం సాయంత్రం గోపాలపురం మండలం జగన్నాథపురం శివారులో ఏర్పాటు చేసిన బోర్డరు చెక్‌పోస్టు వద్ద సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారి నుంచి 4.290కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు..

తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా మంగపేట గ్రామం దేవత హనుమంతరావు అపరాల వ్యాపారం చేస్తుంటాడు. అతడి వద్ద తెలంగాణకు చెందిన బైట్ల సాయిబాబా 20 ఏళ్లుగా గుమస్తాగా పని చేస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా సాయి బాబా తరచూ అపరాలు కాకినాడ తీసుకెళ్లి అమ్ముతుంటాడు. అక్కడ అపరాలు అమ్మిన సొమ్ము రూ.7,45,000 బ్యాగులో పెట్టుకుని గత నెల 29వ తేదీన బస్సు ఎక్కి రాజమహేంద్రవరంలో దిగాడు. అక్కడ సాయిబాబాకు గతంలో పరిచయం ఉన్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట గ్రామానికి చెందిన ఏర్నేటి విజయకుమారి, ఆమె మేనల్లుడు మాడా మణికుమార్ తారసపడ్డారు. తాము కూడా తెలంగాణ వస్తున్నామని చెప్పి సాయిబాబాతో పాటు రాజమహేంద్రవరంలో బస్సు ఎక్కారు. గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్‌కి వచ్చేసరికి సాయిబాబా నిద్రపోతున్న సమయంలో ఇద్దరూ సొమ్ము ఉన్న బ్యాగును దొంగిలించి బస్సు దిగి పారిపోయారు. మెలకువ వచ్చి చూడగా సాయిబాబా దగ్గర సొమ్ములున్న బ్యాగ్ కనిపించకపోవడంతో గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దేవరపల్లి సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ మండపేట వెళ్లి విజయకుమారి, మణికుమార్‌లను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.7,45,000 రికవరీ చేశారని, వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ సత్యానందం, పోలీస్ సిబ్బంది ఉన్నారని డీఎస్పీ రామారావు తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, మార్చి 2: గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరు మం డలం కుమారదేవంలో గోదావరి నదిలో గుర్తుతెలియని ఉందని సమాచారం తెలియడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు 5.2 అడుగులు, ఒంటిపై నలుపు రం గు షర్ట్‌పై పింక్ కలర్ పువ్వులు, నలుపురంగు షార్ట్ ఉన్నాయన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94407 96623, 94407 96621 నెంబర్లకు గాని, కొవ్వూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో గని సమాచారం అందజేయాలన్నారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

దేవరపల్లి మహిళా క్రికెట్ టీంకు

కలెక్టర్ మాధవీలత అభినందన

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 2 : ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన దేవరపల్లి సచివాలయం మహిళల క్రికెట్ టీంకు కలెక్టర్ కె.మాధవీలత ట్రోఫీని అందజేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ చేతుల మీదుగా కెప్టెన్ చింతపల్లి కవిత, జట్టు సభ్యులు ట్రోఫీని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ కోచ్ బీఎంఎం శేషగిరి, క్రీడాధికారి వీజీ నాగేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దేవరపల్లి, మార్చి2: మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలంలో శనివారం సాయంత్రం యర్నగూడెం, త్యాజంపూడి గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ మహిళలు ఆర్థిక పరిపుష్టి కోసం అన్ని వర్గాల మహిళలకు ఆర్థిక సహకారాన్ని సీఎం జగన్ అందజేశారన్నారు. ఆర్‌బీకే కేంద్రాల ద్వారా రైతులకు ధాన్యం గిట్టుబాటు ధరకి ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం విద్యా, వైద్యరంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దన్, కూచిపూడి సతీష్, త్యాజంపూడి సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉపసర్పంచ్ కుసులూరి సతీష్, రాజేంద్రబాబు, యర్నగూడెం సర్పంచ్ భరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఏ సంస్కృతంలో కొవ్వూరు యువతికి గోల్డ్‌మెడల్

కొవ్వూరు, మార్చి 2: ఎంఏ సంస్కృతంలో కొవ్వూరుకు చెందిన యువతి గోల్డ్‌మెడల్ సాధించారు. స్థానిక అచ్చాయమ్మకాలనీకి చెందిన కర్రి లక్ష్మీదుర్గ హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తోంది. 2021-23 విద్యా సంవత్సరంలో లక్ష్మీదుర్గ ఏమ్ఏ తెలుగు పూర్తిచేశారు. ఈ సందర్భంగా సంస్కృత భాషలో (ఏప్లస్) అత్యధిక మార్కులు సాధించి గోల్డ్‌మెడల్‌ను కైవసం చేసుకున్నారు. గత నెల 28న యూనివర్శిటీ 16వ స్నాతకోత్సవాన్ని హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణా గవర్నర్ తమిళిసై లక్ష్మీదుర్గను గోల్డ్‌మెడల్‌తో సత్కరించినట్టు లక్ష్మీదుర్గ తెలిపారు

హత్యారాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ

- రాష్ట్రంలో అధికార దుర్వినియోగం.. ఇసుక దోపిడీ
- మంత్రి అరాచకాలకు అంతంలేదు : ఎమ్మెల్యే గోరంట్ల



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 2: రాష్ట్రంలో అధికార వైసీపీ హత్యారాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు.. ప్రభుత్వాధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ తప్పుడు విధానాల్లో ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును ప్రచార ఆర్భాటానికి, ఫ్లెక్సీలకు ఉపయోగిస్తున్నారని, వలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ దొంగ ఓట్లను చేర్పాలని అధికారులు ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం రూరల్‌లో మంత్రి గారి అరాచకాలకు అంతంలేకుండా పోయిందని, పంచాయతీ నిధులతో ఫ్లెక్సీలకు ప్రచారాలకు సొమ్మును వినియోగిస్తున్నారని, అంతేకాకుండా అంగన్వాడీలకు, ఆశ వర్కర్లకు బహుమతులు ఇస్తూ అధికార దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ఇక ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తులను కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు కేటాయిస్తున్నారన్నారు. రాజ్యామహేంద్రవరం కేంద్రంగా ఇసుక మాఫియా జగన్ రెడ్డి నడిపిస్తున్నాడని చెప్పారు. రోజుకు ఇసుక పై రూ 2 కోట్లు పైగా సొమ్ము దోచుకుంటున్నారని ఎన్‌జీటీ ఆదేశాలను కూడా లెక్కచేయడం లేదన్నారు. పేద కార్మికుల పొట్ట కొట్టి జగన్ యంత్రాలతో ఇసుకను తవ్వించేస్తున్నాడని విమర్శించారు. వైఎస్ వివేకానందరెడ్డిని జగన్ రెడ్డి ముఠానే హతమార్చిందన్నారు. సీబీఐ విచారణ పిటిషన్ వేస్తానని సునీతమ్మ అంటే జగన్ ఎందుకు ఆపారని, తొలుత విచారణ కోరి అటుపై ఎందుకు ఆపారో జగన్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రిగా వుండే అర్హత జగన్‌కు లేదన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.